


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

26.08.2026

బుధవారం | రంగారెడ్డి

సంపుటి : 01 | సంచిక: 57

పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి ఆత్మహత్య

- శ్రీశైలంలో విషాదకర ఘటన
- ప్రైవేట్ సత్రంలో రూమ్ తీసుకుని..
- ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నారు
- ఆరోగ్య సమస్యలు, తీవ్ర ఆర్థిక ఇబ్బందులే కారణం

2లో..



## కొండా సురేఖపై వేటు తప్పదా?



**తెలంగాణ ప్రతినిధి, ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్ :**


తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ కుటుంబం వ్యవహారం రోజురోజుకూ రాజకీయ వేడిని పెంచుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన తీవ్ర వ్యాఖ్యలతో మొదలైన వివాదం ఇప్పుడు మంత్రి పదవిపై చర్చకు దారితీసింది. సుస్మిత వ్యాఖ్యలను కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ తీవ్రంగా పరిగణించి కొండా సురేఖకు వివరణ కోరింది. అయితే తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనకు ఎలాంటి సంబంధం లేదని సురేఖ స్పష్టం చేశారు. ఆ వ్యాఖ్యలు సుస్మిత వ్యక్తిగత అభిప్రాయాలని పార్టీకి ఇచ్చిన వివరణలో పేర్కొన్నారు. సుస్మిత కూడా తన వ్యాఖ్యలు వ్యక్తిగతమైనవేనని, వాటికి తన తల్లికి సంబంధం లేదని స్పష్టం చేశారు.

- రేవంత్–కొండా కుటుంబం మధ్య ముదురుతున్న విభేదాలు
- కూతురి వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో రాజకీయ కలకలం
- భర్తరఫ్ చేస్తే సురేఖ రాజీనామా చేస్తారా?
- పరకాలపై కొండా కుటుంబం కన్ను.. రేవంత్ వ్యూహమేంటి?
- బైఎలక్షన్ వస్తే సవాల్ స్వీకరిస్తారా?
- అధిష్ఠానం నిర్ణయంపై తెలంగాణ కాంగ్రెస్‌లో ఉత్కంఠ

2లో..

## హిజాబ్ ఇస్లాంలో తప్పనిసరి కాదు!

- అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు



**అలహాబాద్, ఆగస్ట్ 25, అనంత జనశక్తి న్యూస్**

పాఠశాల యూనిఫామ్‌తో పాటు హిజాబ్ లేదా తలపై స్కార్ఫ్ ధరించేందుకు అనుమతించాలని కోరుతూ ఓ ముస్లిం విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. తరగతి గదిలో హిజాబ్ ధరించడం ఇస్లాంలో తప్పనిసరి మతపరమైన ఆచారం అని నిరూపించడంలో పిటిషనర్ విఫలమయ్యారని కోర్టు పేర్కొంది. ఆగస్టు 21న జస్టిస్ జేజే మునీర్, జస్టిస్ ఇందర్‌జీత్ శుక్లాలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. 2లో..

## మూసీ ప్రాజెక్టుపై రేవంత్ స్పెషల్ ఫోకస్

- మూసీ ప్రాజెక్టుపై సీఎం రేవంత్ సమీక్ష
- భూసేకరణ వేగవంతం చేయాలని ఆదేశం
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌పై స్పష్టమైన విధానం
- న్యాయ వివాదాలు రాకుండా చర్యలు
- ఫేజ్-2 టెండర్లకు త్వరితగతిన ఆదేశాలు
- తక్కువ వడ్డీ రుణాలపై దృష్టి
- టీడీఆర్‌పై వారానికోసారి సమీక్ష
- అనుబంధ అభివృద్ధి పనులపైనా ఫోకస్





**హైదరాబాద్, ఆగస్ట్ 25, అనంత జనశక్తి న్యూస్**


తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. హైదరాబాద్ అభివృద్ధిలో కీలకంగా భావిస్తున్న ఈ మూసీ ప్రాజెక్టు పురోగతిపై మంగళవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించారు. భూసేకరణ నుంచి టెండర్ల వరకు కీలక అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో జాప్యం లేకుండా నిర్ణీత ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. మూసీ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. 2లో..

భూముల సమీకరణకు సంబంధించి స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. మరీ ముఖ్యంగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూములు, ల్యాండ్ పూలింగ్ అంశాలపై రూల్స్‌కు అనుగుణంగా సమగ్ర విధానాన్ని సిద్ధం చేయాలని సూచించారు. భూసేకరణ విషయంలో భవిష్యత్‌లో న్యాయపరమైన వివాదాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, చట్టపరమైన అంశాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు ఫేజ్ 2 పనులకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రాజెక్టు పనులకు అవసరమైన నిధుల కోసం తక్కువ వడ్డీతో రుణాలు పొందే అవకాశాలను పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. అదే విధంగా ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) అంశంపై ప్రతి వారం అధికారులు సమీక్ష నిర్వహించాలని చెప్పారు.

## డీఆర్డీఓ టెక్నాలజీ దేశీయ పరిశ్రమలకు బదిలీ

- ఆమోదం తెలిపిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- భారత్‌కు ఇక క్షిపణుల కొరత ఉండదు
- కేంద్రం సంచలన నిర్ణయం

2లో..



## 2 వారాల్లో లొంగిపోవాలి

- మాజీ తెహెల్కా ఎడిటర్ తేజ్‌పాల్‌కు ఆదేశం
- 2013 నాటి అత్యాచారం కేసులో దోషి
- అత్యాచారం కేసులో సుప్రీంకోర్టు షాక్

2లో..



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 25, అనంతజనశక్తి న్యూస్**

2013 నాటి అత్యాచారం కేసులో దోషిగా తేలిన మాజీ తెహెల్కా ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. తేజ్‌పాల్ పిటిషన్‌పై జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని సింగిల్ జడ్జి బెంచ్ సోమవారం విచారణ పూర్తి చేసి తీర్పును రిజర్వ్ చేసింది. తేజ్‌పాల్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, గోవా ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

## ఫీజు బకాయిలపై కాంగ్రెస్ సర్కార్‌కు డెడ్‌లైన్

- ఫీజు బకాయిలపై బండి సంజయ్ ఫైర్
- వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్
- 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన

2లో..



## లిఫ్ట్‌లో సీఎం.. సడన్‌గా ఫస్ట్‌ఫ్లోర్‌లో స్టాప్

- మెట్ల మార్గంలో మీడియా హాల్‌కు రేవంత్ రెడ్డి
- సెక్యూరిటీ సిబ్బందిలో ఒక్కసారిగా కలకలం
- భద్రతా లోపంపై అధికారుల ఆగ్రహం

2లో..



## 22A భూములపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలి

- 22A భూములపై హరీశ్ రావు ఫైర్
- దశాబ్దాల నాటి పట్టా భూములూ నిషేధిత జాబితాలో

**హైదరాబాద్, ఆగస్ట్ 25, అనంతజనశక్తి న్యూస్**


22A నిషేధిత భూముల వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. కమీషన్ల కక్కుర్తి కోసమే సామాన్య ప్రజల ఆస్తులను ప్రభుత్వం నిషేధిత జాబితాలోకి నెట్టిందని హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 2లో..



## వైసీపీ నేతలకు జగన్ సీరియస్ వార్నింగ్

- ఏకగ్రీవం జరిగితే వచ్చే ఎన్నికల్లో..
- ఎమ్మెల్యే సీటు కూడా ఇవ్వను
- ప్రతి చోటా అభ్యర్థిని నిలబెట్టాలి
- పార్టీ నేతలకు కీలక సూచనలు
- 60 రోజుల పాటు స్థానిక నేతలు
- నియోజకవర్గం వదిలి వెళ్లకూడదు

2లో..



## సమ్మె విరమించిన జూనియర్ డాక్టర్లు

- హైకోర్టు కీలక ఆదేశాలు
- డిమాండ్లపై 2 వారాల్లో నిర్ణయం తీసుకోవాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచన

2లో..



# ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి ఆత్మహత్య

**శ్రీశైలం, ఆగస్ట్ 25, అనంతజనశక్తి న్యూస్**

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో అత్యంత విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు లాడ్జి గదిలో అనుమానాస్పద స్థితిలో శవాలై కనిపించారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, నిరంతరం వేధిస్తున్న ఆర్థిక ఇబ్బందులే ఈ దారుణమైన నిర్ణయానికి కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమిక విచారణలో అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి గ్రామానికి చెందిన పల్లపు సుధాకర్ (36) అనే వ్యక్తి తన ముగ్గురు సోదరీమణులు, 15 ఏళ్ల మేనల్లుడితో కలిసి జూలై 28న శ్రీశైలం చేరుకున్నాడు. వీరంతా సుధాకర్‌కు చెందిన ఆటోలోనే వచ్చి... ఓ ప్రైవేట్ సత్రంలోని గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. మంగళవారం రోజున సత్రం సిబ్బంది గది తలుపులు ఎంతకీ తెరుచుకోకపోవడం, లోపలి నుంచి దుర్వాసన వస్తుండటాన్ని గమనించారు. అనుమానం వచ్చి కిటికీలోంచి చూడగా... గదిలో ఉన్న ఐదుగురు కూడా ఉరివేసుకుని కనిపించారు. ఈ భయానక దృశ్యాన్ని చూసిన సిబ్బంది వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే సుధాకర్, అతనిద్దరు అక్కలు, చెల్లెలు, మేనల్లుడు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. దీనికితోడు సుధాకర్ పెద్ద అక్కలు ఇద్దరూ తమ భర్తల నుంచి విడిపోయి జీవిస్తున్నారు. కుటుంబంలో ఏకైక ఆధారమైన సుధాకర్ ఆటో నడుపుతూ వచ్చిన కొద్దిపాటి ఆదాయంతోనే వీరందరినీ పోషిస్తున్నాడు. అయితే... రోజురోజుకు పెరిగిపోతున్న వైద్య ఖర్చులు, కుటుంబ పోషణ భారంగా మారడం, మరోవైపు ఆర్థిక పరిస్థితులు ఎంతకూ మెరుగుపడకపోవడంతో వీరంతా తీవ్ర మనోవేదనకు గురైనట్లు తెలుస్తోంది. జీవితంపై తీవ్ర విరక్తి చెంది, వేరే దారి లేక అందరూ కలిసి ఈ దారుణమైన నిర్ణయం తీసుకుని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి... అన్ని కోణాల్లో సమగ్ర విచారణ జరుపుతున్నారు.

# లిఫ్ట్‌లో సీఎం.. సడన్‌గా ఫస్ట్‌ఫ్లోర్‌లో స్టాప్

**హైదరాబాద్, ఆగస్ట్ 25, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రతలో తీవ్ర లోపం బయటపడటం కలకలం రేపింది. సచివాలయ గ్రౌండ్ ఫ్లోర్‌లోని 29వ నెంబర్ హాల్‌లో సీఎం మీడియా సమావేశానికి ఏర్పాట్లు చేయగా, అక్కడికి చేరుకునేందుకు ముఖ్యమంతంత్రితో పాటు ఇతర ముఖ్య నేతలు లిఫ్ట్ ఎక్కారు. అయితే, నిర్ణీత గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆగాల్సిన లిఫ్ట్ సాంకేతిక సమస్యతో హఠాత్తుగా ఫస్ట్‌ఫ్లోర్‌లో ఆగిపోయింది. దీంతో వేరే దారి లేక సీఎం నేరుగా ఫస్ట్ ఫ్లోర్‌లోని 32 నెంబర్ గదికి వెళ్లి, ఆ తర్వాత మెట్ల మార్గంలో గ్రౌండ్ ఫ్లోర్‌లోని మీడియా హాల్‌కు చేరుకోవాల్సి వచ్చింది. ఈ అనూహ్య పరిణామంతో ముఖ్యమంత్రి సెక్యూరిటీ సిబ్బంది ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. అత్యున్నత భద్రత ఉండాల్సిన ప్రదేశంలో ఇలాంటి లోపం తలెత్తడంపై ఇంటెలిజెన్స్, ఈఎస్డబ్ల్యూ అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సీఎస్ఓ నిర్లక్ష్యం వల్లే ఈ భద్రతా వీక్‌నెస్ బయటపడిందని మండి పడుతూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది.

# హిజాబ్ ఇస్లాంలో తప్పనిసరి కాదు!

(మొదటి పేజీ తరువాయి)

మహిళలు తలపై స్కార్ఫ్ ధరించడం ఇస్లాం మతంలో అత్యవసరమైన ఆచారం కాదని గతంలో పలు హైకోర్టులు అభిప్రాయపడిన విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది.

**కర్ణాటక హైకోర్టు తీర్పు ప్రస్తావన**

కర్ణాటక హైకోర్టు విద్యాసంస్థల్లో హిజాబ్‌పై ఆంక్షలను సమర్థిస్తూ ఇచ్చిన తీర్పుకు ప్రస్తుతం కూడా ప్రాధాన్యత ఉందని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. ఈ అంశంపై సుప్రీంకోర్టులో గతంలో భిన్నాభిప్రాయాలతో తీర్పు వెలువడిందని, తుది నిర్ణయం ఇంకా రాలేదని తెలిపింది. అందువల్ల కర్ణాటక హైకోర్టు తీర్పు తమకు ముఖ్యమైన మార్గదర్శకంగా ఉందని ధర్మాసనం పేర్కొంది. హిజాబ్ ధరించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 కింద రక్షణ పొందే అత్యవసర మతపరమైన ఆచారం అని విద్యార్థిని చేసిన వాదనను కోర్టు అంగీకరించలేదు. హిజాబ్ ధరించడం తప్పనిసరి అని నిరూపించేందుకు తగిన మతపరమైన ఆధారాలు లేదా ప్రామాణిక గ్రంథాలను పిటిషనర్ సమర్పించలేదని కోర్టు పేర్కొంది.

**పాఠశాల డ్రెస్ కోడ్‌పై కోర్టు వ్యాఖ్యలు**

పాఠశాల యూనిఫామ్ నిబంధనలు సమానంగా, వివక్ష లేకుండా, నిజాయితీగా అమలు చేస్తూ సంస్థలో క్రమశిక్షణ, గుర్తింపును కాపాడేందుకు ఉద్దేశించినవిగా ఉంటే, డ్రెస్ కోడ్‌ను నిర్ణయించే అధికారం ప్రధానంగా పాఠశాల యాజమాన్యానిదేనని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌ను ప్రయాగ్‌రాజ్‌లోని అత్తర్సుయా ప్రాంతంలోని టాగోర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని దాఖలు చేసింది. తాను ఆరో తరగతి నుంచి హిజాబ్ ధరిస్తున్నానని, 11వ తరగతిలో ప్రవేశం సమయంలో పాఠశాల యాజమాన్యం అభ్యంతరం వ్యక్తం చేసిందని ఆమె పేర్కొంది. అయితే గతంలో ఎలాంటి అభ్యంతరం లేకుండా హిజాబ్ ధరించేందుకు అనుమతించినంత మాత్రాన అదే విధానాన్ని కొనసాగించాలని పాఠశాలపై చట్టపరమైన బాధ్యత ఏర్పడదని కోర్టు స్పష్టం చేసింది. గతంలో హిజాబ్ ధరించి నందుకు అభ్యంతరం వ్యక్తం చేయకపోవడం వల్ల యూనిఫామ్ నిబంధనలను మార్చాలని లేదా సడలించాలని కోరే హక్కు ఏర్పడదని పేర్కొంటూ విద్యార్థిని పిటిషన్‌ను కొట్టివేసింది..

# డీఆర్డీఓ టెక్నాలజీ దేశీయ పరిశ్రమలకు బదిలీ

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 25, అనంతజనశక్తి న్యూస్**

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) అభివృద్ధి చేసిన అన్ని సంప్రదాయ క్షిపణి వ్యవస్థల సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశీయ పరిశ్రమకు బదిలీ చేయడానికి ఆయన ఆమోదం తెలిపారు. ఈ టెక్నాలజీ బదలాయింపుతో దేశంలోనే క్షిపణుల ఉత్పత్తికి మార్గం సుగమమైంది. గతంలో ప్రభుత్వం రంగ సంస్థల వద్ద ఉన్న ఈ టెక్నాలజీని ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడం ద్వారా క్షిపణుల ఉత్పత్తి మరింత పెరగనుంది. ఇదే సమయంలో కంపెనీల అర్హత, ధ్రువీకరణ, నియంత్రణ అసవరాలను బట్టి, కంపెనీలు అన్ని ప్రమాణాలు పాటించిన తర్వాతే ఈ టెక్నాలజీ షేరింగ్ ఉంటుంది. దేశంలోనే అధునాతన క్షిపణుల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం ఈ నిర్ణయం ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. అత్యవసర పరిస్థితుల్లో ఆయుధాల సరఫరాకు అంతరాయం కలగకుండా దేశీయ ఉత్పత్తి సామర్థ్యం కీలకంగా మారనుంది. కేంద్రం నిర్ణయం వల్ల రక్షణ తయారీ వ్యవస్థ మరింత విస్తరిస్తుంది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, ఇతర సాంకేతిక భాగస్వాములు కూడా క్షిపణుల సప్లై చైన్‌లో భాగస్వామం అయ్యే అవకాశం ఉంది. ఇదే కాకుండా, అధునాతన రక్షణ వ్యవస్థల కోసం భారత్ విదేశీ సరఫరాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇప్పుడు డీఆర్డీవో సాంకేతికను అందించడం ద్వారా ఈ ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించాలని కేంద్రం భావిస్తోంది. దేశంలో క్షిపణి వ్యవస్థల్ని తయారు చేయడం వల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా చేయడంతో పాటు అవసరమైన సమయంలో ఆయుధాల లభ్యతను వేగంగా పెంచే అవకాశం ఉంది. ప్రైవేట్ భాగస్వామ్యం పెరగడం వల్ల రక్షణ తయారీ రంగంలో పోటీ, సాంకేతిక ఆవిష్కరణలు కూడా సాధ్యం అవుతాయి. అంతర్జాతీయ ఎగుమతి చేసే సామర్థ్యం పెరుగుతుంది.

# ఫీజు బకాయిలపై కాంగ్రెస్ సర్కార్‌కు డెడ్‌లైన్

**హైదరాబాద్, ఆగస్ట్ 25, అనంతజనశక్తి న్యూస్**

రాష్ట్రంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక విద్యాసంస్థలకు కనీస బకాయిలు చెల్లించడం చేతగాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విదేశీ విశ్వవిద్యాలయాలను రప్పిస్తామనడం అత్యంత హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు దాదాపు రూ. 15 వేల కోట్లకు చేరుకోవడంతో వేలాది ప్రైవేట్ కళాశాలలు మూతపడే స్థితికి చేరుకున్నాయని, లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారం**

రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, నర్సింగ్ విద్యనభ్యసిస్తున్న దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని బండి సంజయ్ పేర్కొన్నారు. వీరిలో అత్యధికులు దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారేనని, ఫీజు రీయంబర్స్‌మెంట్ నిలిచిపోవడంతో వీరంతా ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. బకాయిలు రాకపోవడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయని, దీంతో విద్యార్థులు పైచదువులకు వెళ్లలేక, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రైవేట్ కాలేజీల్లో విద్యార్థులు వివక్షను, అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తోందని మండిపడ్డారు.

**మాట తప్పడంలో బీఆర్ఎస్‌ను మించిపోయిన కాంగ్రెస్**

వన్ టైమ్ సెటిల్‌మెంట్ (OTS) కింద ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలన్నీ చెల్లిస్తామని, నిర్ణీత వ్యవధిలోనే నిధులు విడుదల చేస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని బండి సంజయ్ ప్రశ్నించారు. హామీలిచ్చి మోసం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మించిపోయిందని విమర్శించారు. కళాశాలల యాజమాన్యాలు ఉపాధ్యాయులకు జీతాలు ఇచ్చుకోలేక, మెయింటెనెన్స్ చార్జీలు భరించలేక తీవ్రమైన అప్పుల ఊబిలో కూరుకుపోయాయని, ఫీజులు అడిగితే బెదిరింపులకు దిగడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదని హితవు చెప్పారు.

**"ఫీజు బకాయి – బీజేపీ లడాయి".. పోరాటం ఉధృతం చేస్తాం**

ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు చేపట్టిన "ఫీజు బకాయి - బీజేపీ లడాయి" దీక్షకు బండి సంజయ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ దీక్షకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, ప్రజా సంఘాల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రూ. 15 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో రామచంద్రరావు నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచేదాకా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# 22A భూములపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ ఎం.జే. గార్డెన్స్‌లో 22A భూముల సమస్యలతో సతమతమవుతున్న బాధిత కుటుంబాల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, గోరేటి వెంకన్న తదితరులతో కలిసి బాధితుల ఆవేదనను స్వయంగా అడిగి తెలుసుకున్న హరీశ్ రావు, బీఆర్ఎస్ పార్టీ పక్షాన వారికి పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**ఏ-1 రేవంత్ రెడ్డి, ఏ-2 పొంగులేటి.. కమీషన్ల కోసమే ఈ దోపిడీ**

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై పదునైన విమర్శలు గుప్పించారు. 22A కుట్ర వెనుక భారీ కమీషన్ల బాగోతం దాగి ఉందన్న ఆయన, ఈ అక్రమాల్లో ఏ1గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏ2గా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. 5050 కమీషన్ల కోసమే లక్షలాది మంది ప్రజలను నిద్రలేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. 98 శాతం భూములను 22A జాబితా నుంచి తొలగించామని మంత్రి పొంగులేటి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని, అదే నిజమైతే వందలాది మంది బాధితులు తమ గోడు వెళ్లబోసుకోవడానికి ఇక్కడికి ఎందుకు వస్తారని ప్రశ్నించారు. తప్పు చేసింది ప్రభుత్వం అయితే, దానిని సరిదిద్దుకోవడానికి దరఖాస్తుల పేరుతో సామాన్యులు ఆఫీసుల చుట్టూ ఎందుకు తిరగాలని నిలదీశారు.

**దశాబ్దాల నాటి పట్టా భూములు కూడా బ్లాక్.. అక్రమ వసూళ్ల పర్వం**

58 ఏళ్ల క్రితం ఏర్పడిన పద్మారావు నగర్ ఫేజ్ 1, 1950ల నాటి స్ప్రింగ్ ఫీల్డ్, నిజాంపేట్ లాంటి కాలనీల్లోని దశాబ్దాల క్రితం నాటి పట్టా భూములను కూడా 22Aలో చేర్చడం తుగ్లక్ చర్య కాక మరేమిటని హరీశ్ రావు ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీలో విల్లాకు, ఫ్లాట్‌కు రూ.30 వేలు వసూలు చేస్తున్నారని, డబ్బులు ఇస్తేనే పని అవుతుందని బాధితులు బహిరంగంగా వాపోతున్నారని తెలిపారు. అమీన్‌పూర్ నుంచి వచ్చిన బాధితుడిని ఎంఆర్వో, ఆర్డీవో, కలెక్టర్ అని తిప్పించుకుని, చివరకు బయట బ్రోకర్లను కలిస్తేనే పని అవుతుందని బెదిరిస్తున్నారన్నారు. ఈ సమస్య కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా సుమారు కోటి ఎకరాల వ్యవసాయ భూములను 22Aలో పెట్టారని, దీనివల్ల రైతులకు రైతుబంధు, ఎరువులు, విద్యుత్ కనెక్షన్లు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**సీఎం తమ్ముడికి వందల కోట్లు.. ప్రజల ఆస్తులేమో నిషేధిత జాబితాలో**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన తమ్ముడికి మాత్రం వందల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను కట్టబెడతారని, సామాన్య ప్రజల ఆస్తులను మాత్రం 22Aలో పెట్టి ఇబ్బందుల పాలు చేస్తారని హరీశ్ రావు విమర్శించారు. చివరికి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్, సీఎం ఇల్లు కూడా 22A నిషేధిత జాబితాలోనే ఉన్నాయంటే ఈ ప్రభుత్వ పనితీరు ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ప్రభుత్వ భూములున్నా హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, హౌసింగ్ బోర్డు భూములతో పాటు పిల్లలు ఆడుకునే వెయ్యి గజాల పార్కును కూడా రేవంత్ రెడ్డి అమ్మకానికి పెట్టారని, ఇలా అమ్ముకుంటూ పోతే రేపు బడికి, గుడికి, చివరకు స్మశాన వాటికకు కూడా భూమి మిగలదని ధ్వజమెత్తారు.

**శ్వేతపత్రం విడుదల చేయాలి.. అసెంబ్లీని స్తంభింపజేస్తాం**

ఈ మొత్తం 22A నిషేధిత భూముల అక్రమాలపై తక్షణమే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అసలు ఈ భూములను ఎవరు నిషేధిత జాబితాలో పెట్టమన్నారో నిజాలు బయటపడాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలని, నిషేధిత జాబితాను వెబ్‌సైట్‌లో ఎందుకు బ్లాక్ చేశారో సమాధానం చెప్పాలని అన్నారు. ప్రజల భూములతో చెలగాటమాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ముఖ్యమంత్రి తక్షణమే బర్తరఫ్ చేయాలని కోరారు. బాధితుల పక్షాన నిలబడి సెప్టెంబర్ 7న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తామని, సభను స్తంభింపజేసి అయినా బాధితులకు న్యాయం జరిగేలా పోరాడతామని స్పష్టం చేశారు.

# వైసీపీ నేతలకు జగన్ సీరియస్ వార్నింగ్

**అమరావతి, ఆగస్ట్ 25, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పార్టీ నేతలకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. స్థానిక స్థంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవం జరిగితే.. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే కాండిడేట్ కాలేరని తేల్చి చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పోటీ చేయాల్సిందేనని.. ఎక్కడా ఏకగ్రీవాలకు ఆస్కారం ఉండకూడదన్నారు. ఒకవేళ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడున్న నియోజకవర్గ ఇంఛార్జ్ పార్టీ అభ్యర్థులు కాలేరన్నారు. తాడేపల్లిలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతల సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికల తర్వాత ప్రతి నియోజకవర్గంలో ఎక్కడెక్కడ అభ్యర్థులను నిలబెట్టారో నివేదికలు తెప్పించుకుంటానని.. అభ్యర్థులను నిలబెట్టడంతో పాటుగా వారికి ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంత బలంగా మద్దతిచ్చారన్నదానిపైనా రిపోర్ట్‌లు తీసుకుంటానన్నారు. ప్రతి నేత ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని జగన్ సీరియస్‌గా చెప్పారు.

స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తే కూటమికి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇస్తారని జగన్ వ్యాఖ్యానించారు. ఏపీ ప్రభుత్వం స్థానిక సంస్థల పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తామని చెబుతోందని.. ఈ నిర్ణయం వైఎస్సార్‌సీపీకి అనుకూలమని వ్యాఖ్యానించారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో బలమైన అభ్యర్థుల్ని పోటీ చేయించాలని సూచించారు.. ఒకవేళ అవసరం అనుకుంటే కార్యకర్తలకు అండగా నిలిచేందుకు పార్టీ నేతల కుటుంబ సభ్యులను పోటీకి దింపడానికీ వెనకాడొద్దని సూచించారు. ప్రతి స్థానంలో ప్రజల గొంతు వినిపించేలా, పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పించేలా పోటీ చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కార్యకర్తల కోసం నేతలు గట్టిగా నిలబడితేనే.. సార్వత్రిక ఎన్నికల్లో కార్యకర్తలు నేతల కోసం గట్టిగా నిలబడతారన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు గెలుపోటములకు సంబంధించినవి కావని.. కార్యకర్తల కోసం నిలబడాల్సిన ఎన్నికలని జగన్ చెప్పుకొచ్చారు. ఈ ఎన్నికల్ని నిష్పక్షపాతంగా జరగనివ్వరని.. స్థానిక నేతలు ఈ విషయాన్ని తేలికగా తీసుకోకుండా బలమైన అభ్యర్థుల్ని పోటీ చేయించాలని సూచించారు. ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన, కూటమి ప్రభుత్వ పాలనకు తేడాను వివరించాలని సూచించారు. ఇంటింటికి వెళ్లేందుకు అవసరమైన సమాచారంతో పాటుగా అవసరమైన ప్రచార సామగ్రిని పార్టీ అందిస్తుందన్నారు. త్వరలోనే పార్టీ కార్యకర్తలకు గుర్తింపు కార్డులు అందిస్తామన్నారు.. గ్రామస్థాయి కమిటీలు, అనుబంధ విభాగాల కార్యకర్తల వరకు పంపిణీ చేస్తామన్నారు. సెప్టెంబరు 5,6,7 తేదీల్లో జిల్లా స్థాయి సమావేశాలు.. 8,9,10,11 తేదీల్లో అసెంబ్లీ నియోజవకర్గాల స్థాయి సమావేశాలు నిర్వహించాలన్నారు. సెప్టెంబరు 12 నుంచి 22 వరకు మండల, వార్డు, డివిజన్ స్థాయిల్లో సమావేశాలు నిర్వహించాలన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మీడియా, లీగల్ సెల్‌లను యాక్టివేట్ చేయాలని సూచించారు జగన్. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో పార్టీ కేడర్‌పై దౌర్జన్యాలు చేసే అవకాశం ఉందని.. కాబట్టి కార్యకర్తల్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి నియోజకవర్గంలో సోషల్ మీడియాను యాక్టివ్ చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నిక అభ్యర్థుల ఎంపిక సమయంలో ఈగోలకు అవకాశం ఇవ్వకూడదని.. అందర్నీ కలుపుకుని ముందుకు సాగాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో నేతలు మరో రెండు నెలల పాటూ కేడర్‌కు అందుబాటులో ఉండాలని.. నియోజకవర్గం దాటి వెళ్లకూడదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలీసులు న్యాయంగా వ్యవహరించాలని.. ఒకవేళ అలా జరగకుండా కార్యకర్తల్ని వేధించేవారిని, అన్యాయం చేసేవారి వివరాలను నమోదు చేయాలని సూచించారు. చట్టవిరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై భవిష్యత్‌లో చర్యలు తీసుకుంటామన్నారు.

# సమ్మె విరమించిన జూనియర్ డాక్టర్లు

**అమరావతి, ఆగస్ట్ 25, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్ డాక్టర్లు ఎట్టకేలకు సమ్మెను విరమించారు. తాము సమ్మె విరమిస్తున్నట్లు హైకోర్టుకు జూనియర్ డాక్టర్ల సంఘం తెలియజేసింది. అదే సమయంలో తమ డిమాండ్లను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని హైకోర్టును కోరారు. రెండు వారాల్లోగా జూనియర్ డాక్టర్ల డిమాండ్లను పరిష్కరించే అంశంపై నిర్ణయం తీసుకోవాలని ఏపీ ప్రభుత్వాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. ఏపీలో జూనియర్ డాక్టర్లు సమ్మె చేయడంపై హైకోర్టులో పిల్ దాఖలైంది.. ఇవాళ కోర్టు విచారణ చేపట్టగా.. జూనియర్ డాక్టర్లు తాము సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సమ్మెను సవాల్ చేస్తూ ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన సామాజిక కార్యకర్త రవీంద్ర కుమార్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. రాష్ట్రంలో 9వేలమంది జూనియర్ డాక్టర్లు సమ్మెలో పాల్గొంటున్నారని.. వెంటనే వారిపై ఎస్మా అమలు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషనర్ తరఫున లాయర్ కోర్టును కోరారు. రాష్ట్రంలో సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లతో ప్రభుత్వం చర్చలు జరుపుతోందని అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కోర్టుకు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం వైద్యసేవలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. జూనియర్ డాక్టర్ల డిమాండ్లపై హైకోర్టు ధర్మాసనం ఆరా తీయగా.. ఇతర రాష్ట్రాల్లో చెల్లించే స్టైఫండ్ కంటే ఎక్కువ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని ఏజీ తెలిపారు. వారి డిమాండ్‌ను ఆమోదిస్తే రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై భారం పడుతుందన్నారు. ఈ వాదనల తర్వాత జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ స్పందన ఏంటో తెలియజేయాలని హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఏపీ ప్రభుత్వం ఆస్పత్రుల్లో అత్యవసర వైద్య సేవలకు ఇబ్బంది లేకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారు.. జూనియర్ డాక్టర్లతో సమ్మె విరమించజేయడానికి ఏం చేస్తున్నారో తెలియజేయాలని కూడా ఆదేశించింది. అయితే ఇవాళ విచారణ జరగ్గా.. తాము సమ్మె విరమిస్తున్నట్లు జూనియర్ డాక్టర్లు ప్రకటించారు. జూనియర్ డాక్టర్లు ప్రధానంగా మూడు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నారు. స్టైఫండ్ 20శాతం పెంచాలని.. ప్రొఫెసర్ల పదవీవిరమణ వయసు 65 ఏళ్లకు పెంచే ప్రతిపాదనను విరమించాలని.. నాన్ క్లినికల్ పోస్టుల్ని ఎంఎస్‌సీ పీహెచ్‌డీలతో కాకుండా అర్హులతో భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గత ఎనిమిది నెలలుగా కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతోనే సమ్మెకు దిగామని జూనియర్ డాక్టర్లు చెబుతున్నారు. జూనియర్ డాక్టర్లతో చర్చలు జరిపినా ఫలించలేదు.. ఇంతలో ఈ అంశం హైకోర్టుకు చేరగా.. జూనియర్ డాక్టర్లు సమ్మెను విరమించారు. అయితే ఏపీ హైకోర్టు జూనియర్ డాక్టర్ల డిమాండ్లను పరిష్కరించాలని ఆదేశించడంతో ఏపీ ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్నది చూడాలి.

# కొండా సురేఖపై వేటు తప్పదా?

(మొదటి పేజీ తరువాయి)



అసలు వివాదానికి పరకాల రాజకీయమే కేంద్ర బిందువుగా మారింది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మళ్లీ అవకాశం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సుస్మిత తీవ్రంగా స్పందించారు.

పరకాల నుంచి తాను పోటీ చేయాలని భావిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రకటనపై ఆమె బహిరంగంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. అవసరమైతే ఇప్పుడే ఎమ్మెల్యే రాజీనామా చేసి ఉప ఎన్నికకు రావాలని కూడా సవాల్ చేశారు. దీంతో ఇంతకాలం అంతర్గతంగా ఉన్న అసంతృప్తి బహిరంగ రాజకీయ పోరుగా మారిందనే చర్చ మొదలైంది. మరోవైపు సుమారు 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సుస్మిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకత్వాన్ని కోరినట్లు వార్తలు వచ్చాయి.

దీంతో వ్యవహారం వ్యక్తిగత వివాదాన్ని దాటి పార్టీ అంతర్గత క్రమశిక్షణ అంశంగా మారింది.

ఇలాంటి పరిస్థితుల్లో కొండా సురేఖపై పార్టీ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

భర్తరఫ్ జరిగితే కొండా సురేఖ రాజకీయంగా ఏ నిర్ణయం తీసుకుంటారన్నది మరో ఆసక్తికర అంశం. ఆమె రాజీనామా చేసి ప్రజల్లోకి వెళ్లి తన బలాన్ని నిరూపించుకోవాలనే వ్యూహాన్ని ఎంచుకుంటారా అన్న చర్చ కూడా మొదలైంది. అయితే ప్రస్తుతం ఆమె స్వయంగా రాజీనామా చేస్తానని ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అలాగే ఆమెను మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయనున్నట్లు కూడా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదు. ఒకవేళ సురేఖ రాజీనామా చేసి, ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసి ఉప ఎన్నికకు వెళ్లే పరిస్థితి వస్తే అది కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మక పోరుగా మారే అవకాశం ఉంది. కొండా కుటుంబానికి వరంగల్ ప్రాంతంలో ఉన్న రాజకీయ ప్రభావం, కాంగ్రెస్ పార్టీ అధికార బలం రెండూ ఆ ఎన్నికలో పరీక్షకు నిలిచే అవకాశం ఉంటుంది. అదే సమయంలో పరకాల రాజకీయ సమీకరణాలు కూడా కొత్త మలుపు తిరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం మాత్రం సీఎం రేవంత్‌రెడ్డి ఈ వ్యవహారంపై తుది నిర్ణయం కాంగ్రెస్ అధిష్ఠానానిదేనని స్పష్టం చేశారు. పార్టీ అంతర్గత అంశాలను బహిరంగంగా చర్చించవద్దని కూడా ఆయన పార్టీ నేతలకు సూచించారు. దీంతో కొండా సురేఖ భవిష్యత్తుపై నిర్ణయం రాష్ట్ర స్థాయిలో కాకుండా అధిష్ఠానం స్థాయిలోనే తేలే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే కొండా సురేఖ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడం కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఈ భేటీ ఆధారంగా ఆమెపై చర్య తప్పదని చెప్పడం మాత్రం ఇప్పుడే సాధ్యం కాదు. అందుకే ప్రస్తుత పరిణామాలను చూస్తే భర్తరఫ్ ఖాయమా? రాజీనామా చేస్తారా? లేక అధిష్ఠానం మధ్యవర్తిత్వంతో వివాదానికి తెరపడుతుందా? అన్నదే తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది.

# మూసీ ప్రాజెక్టుపై రేవంత్ స్పెషల్ ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

**మూసీ ప్రాజెక్టుకు సంబంధించిన పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ.. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.**


**మూసీ ప్రాజెక్టుతో అనుసంధానమైన మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయం పనులకు సంబంధించిన టెండర్లను వెంటనే పిలవాలని రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. అలాగే కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు మరింత ప్రచారం కల్పించి.. మరింతమంది పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ భవిష్యత్ అభివృద్ధికి కీలకమైన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు భూసేకరణ, ఫేజ్-2 టెండర్లు, టీడీఆర్, అనుబంధ అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తాజా సమీక్ష స్పష్టం చేసింది.**



# 2 వారాల్లో లొంగిపోవాలి

(మొదటి పేజీ తరువాయి)





తేజ్‌పాల్ అప్పీల్‌ను విచారణకు స్వీకరించాలంటే ముందుగా ఆయన లొంగిపోయినట్లు ధ్రువీకరించే సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందని.. లేదంటే లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరుతూ ప్రత్యేక పిటిషన్ దాఖలు చేయాలని తుషార్ మెహతా వాదించారు. సుప్రీంకోర్టు రూల్స్, 2013తో పాటు గత తీర్పులను ఆయన ప్రస్తావించారు.

అయితే కపిల్ సిబల్ మాత్రం గోవా ప్రభుత్వం ప్రస్తావించిన సుప్రీంకోర్టు నిబంధనలు ఈ కేసుకు వర్తించవని వాదించారు. బాంబే హైకోర్టు ఇప్పటికే తేజ్‌పాల్‌కు నాలుగు వారాల గడువు ఇచ్చిందని, అప్పటివరకు ఆయనకు కోర్టు రక్షణ ఉందని తెలిపారు. ఆగస్టు 31న రెగ్యులర్ బెంచ్ ముందు కేసును విచారణకు లిస్ట్ చేయాలని కోరారు.

ఆగస్టు 6న బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తేజ్‌పాల్ ఆగస్టు 20న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2021లో గోవా సెషన్స్ కోర్టు ఇచ్చిన నిర్దోషి తీర్పును బాంబే హైకోర్టు కొట్టివేసి.. తేజ్‌పాల్‌ను అత్యాచారం కేసులో దోషిగా తేల్చింది.

2013 నవంబర్‌లో గోవాలో తెహెల్కా నిర్వహించిన ఓ కార్యక్రమం సందర్భంగా హోటల్ లిఫ్ట్‌లో తనతో పనిచేసిన జూనియర్ మహిళా ఉద్యోగిపై తేజ్‌పాల్ రెండుసార్లు లైంగిక దాడికి పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. అదే నెలలో ఆయనను అరెస్టు చేశారు. 2014 జూలైలో బెయిల్ లభించింది. 2017లో విచారణ ప్రారంభం కాగా.. 2021 మేలో గోవా సెషన్స్ కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. ఈ తీర్పును గోవా ప్రభుత్వం బాంబే హైకోర్టులో సవాల్ చేసింది. 81 పేజీల తీర్పులో హైకోర్టు ట్రయల్ కోర్టు నిర్ణయాన్ని "వక్రీకృతమైనది"గా అభివర్ణించింది. విచారణ సందర్భంగా ఫిర్యాదుదారురాలిని వ్యవహరించిన తీరుపై కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. లైంగిక దాడికి గురైన మహిళ "పర్ఫెక్ట్ బాధితురాలు"లా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే భావనకు ట్రయల్ కోర్టు లోనైందని హైకోర్టు పేర్కొంది. ఆమె వ్యక్తిగత జీవితంపై డిఫెన్స్ చేసిన వాదనలపైనా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

**తేజ్‌పాల్‌కు 10 ఏళ్ల జైలు శిక్ష**

బాంబే హైకోర్టు భారతీయ శిక్షాస్మృతిలోని పలు సెక్షన్ల కింద తేజ్‌పాల్‌ను దోషిగా తేల్చింది. విశ్వాసం లేదా అధికార స్థితిని ఉపయోగించి అత్యాచారానికి పాల్పడినందుకు సంబంధించిన సెక్షన్ 376(2)(f)తో పాటు లైంగిక వేధింపులు, దుస్తులు విప్పే ఉద్దేశంతో దాడి లేదా క్రిమినల్ ఫోర్స్‌కు సంబంధించిన సెక్షన్లు 354(a), 354(b) కింద కూడా దోషిగా నిర్ధారించింది. ఆయనకు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 లక్షలకు పైగా జరిమానా విధించింది. తొలుత రెండు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించిన హైకోర్టు.. ఆయన న్యాయవాదుల అభ్యర్థన మేరకు ఆ గడువును నాలుగు వారాలకు పొడిగించింది. దీంతో సెప్టెంబర్ మొదటి వారంలో ఆయన లొంగిపోవాల్సి ఉంది. సెక్షన్ 376(2)(f) కింద గరిష్ఠంగా జీవిత ఖైదు విధించే అవకాశం ఉంది. తేజ్‌పాల్‌కు విధించిన శిక్షను జీవిత ఖైదుకు పెంచాలని కోరుతూ గోవా ప్రభుత్వం విడిగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ శిక్ష పరిమాణానికి మాత్రమే పరిమితమైంది. అలాగే శిక్షలను ఏకకాలంలో అమలు చేయాలని బాంబే హైకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని కూడా ప్రభుత్వం సవాల్ చేసింది. అయితే సంఘటన జరిగి చాలా కాలం గడిచిపోవడం, ఆ తర్వాత ఎలాంటి నేరపూరిత ప్రవర్తనకు పాల్పడినట్లు

ఆధారాలు లేకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు జీవిత ఖైదు విధించేందుకు నిరాకరించింది. శిక్ష ఖరారు చేసే సమయంలో తేజ్‌పాల్ తనకు క్షమాభిక్ష చూపాలని కోరుతూ.. తాను "రాజకీయ బాధితుడిని" అని పేర్కొన్నారు. తాను ఇద్దరు కుమార్తెలకు తండ్రినని కూడా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే గోవా ప్రభుత్వం తరఫున తుషార్ మెహతా గరిష్ఠ శిక్ష విధించాలని కోరుతూ.. "నో అంటే నో" అనే సందేశం బలంగా వెళ్లాల్సిన అవసరం ఉందని వాదించారు.

# గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్‌తో జెన్‌జీ సమావేశం..

**- యువత ప్రశ్నలకు ఆలోచింపజేసేలా 'కూల్ గురు' సమాధానాలు..!**



భయంగా ఉన్నప్పటికీ ఏదైనా స్థిరమైన నిర్ణయం తీసుకోవాలంటే ఏం చేయాలి? విజయం సాధించాలనే పరుగు పందెంలో చిక్కుకోకుండా ఆశయాలను ఎలా కొనసాగించాలి? మన ఆలోచనలను తల్లిదండ్రులు అర్థం చేసుకోలేకపోతే వారికి అర్థమయ్యేలా ఎలా వివరించాలి? డబ్బు, విలాసవంతమైన జీవితం, విజయవంతమైన కెరీర్.. ఇవన్నీ కోరుకుంటూనే ఆధ్యాత్మికంగా ఉండటం సాధ్యమేనా? నేటి యువత మదిలోని ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ సమాధానాలు చెప్పారు. బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంతర్జాతీయం కేంద్రం దీనికి వేదికైంది.

బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంతర్జాతీయ కేంద్రంలో శనివారం 2,000 మందికి పైగా జెన్‌జి యువత గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్‌తో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను వారు ఆధ్యాత్మిక గురువుతో పంచుకున్నారు. యువతరం 'కూల్ గురు' అని ప్రేమగా సంబోధించే గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ వారి ప్రశ్నలకు ఎంతో సూటిగా, చమత్కారంగా, అదే సమయంలో లోతైన ఆలోచనలను రేకెత్తించేలా సమాధానాలు ఇచ్చారు. గురుదేవ్ తన సమాధానాలతో యువత ముఖాల్లో చిరునవ్వులు పూయించడంతోపాటు.. వారిలో స్ఫూర్తిని నింపారు.

సాధారణ ఆధ్యాత్మిక సమావేశాలకు భిన్నంగా.. పాటలు, కేరింతలు, నవ్వులు, సంగీతం మధ్య ఈ సమావేశం ఎంతో ఉత్సాహంగా సాగింది. డబ్బు సంపాదించడం, మానవ సంబంధాలు, ఆశయాలు, జీవితంలో పైకి ఎదగడం లాంటి ఎన్నో అంశాలపై యువత గురుదేవ్‌ను ప్రశ్నలు అడిగి తమ అనుమానాలు నివృత్తి చేసుకున్నారు.

భయం లేకుండా స్థిరమైన నిర్ణయం తీసుకోవడం గురించి గురుదేవ్ మాట్లాడుతూ.. కఠినత్వానికి తావు ఇవ్వవద్దని జెన్‌జీకి సూచించారు. "మీరు ఒక నిర్ణయానికి కట్టుబడి ఉండాలి. అదే సమయంలో మారేందుకు కూడా అనువుగా ఉండాలి" అని సూచించారు. 'మన తర్కం మన జ్ఞానంపై ఆధారపడి ఉంటుంది, అయితే మన జ్ఞానం ఎప్పుడూ పరిమితమే. జ్ఞానం పెరిగే కొద్దీ మన దృక్కోణం కూడా మారుతుంది. మనకు తెలిసిన విషయాలపై దృఢంగా నిలబడుతూనే.. కొత్త విషయాలను తెలుసుకునేందుకు మన మనసును తెరిచి ఉంచడమే సమతుల్యత' అని ఆయన వివరించారు.

ఎప్పుడూ ఏదో ఒకటి సాధించాలనే ఒత్తిడిని ఎదుర్కొంటున్న తరానికి, అంతర్గత ప్రశాంతతను కోల్పోకుండా ఆశయాలను కొనసాగించడం ఎలా? అనే ప్రశ్నకు.. ధ్యానం ద్వారా ఇది సాధ్యపడుతుందని గురుదేవ్ సమాధానం ఇచ్చారు.

తల్లిదండ్రులను బాధపెట్టకుండా, తాము ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా తమ ఆలోచనలను వారికి అర్థమయ్యేలా ఎలా చెప్పాలనే ప్రశ్నకు గురుదేవ్ స్పందిస్తూ.. పూర్తిగా తమ మాటే నెగ్గాలనే పంతం కంటే, పట్టు విడుపులు ఉండాలని సూచించారు. "కొన్నిసార్లు వాళ్ల మాట నెగ్గనీయండి, కొన్నిసార్లు మీది కూడా," అని ఆయన అన్నారు. "అదే మీ బలం" అని ఆయన చమత్కరించారు.

ఆధ్యాత్మికతకు, విజయానికి మధ్య ఏదైనా విరోధం ఉందా? అనే ప్రశ్నకు.. ఈ రెండింటి మధ్య అసలు విరోధం లేదని గురుదేవ్ స్పష్టం చేశారు. ఆధ్యాత్మికత మనలో స్థయిర్యాన్ని, అంతర్ దృష్టిని, వైఫల్యాల నుంచి తిరిగి కోలుకునే సామర్థ్యాన్ని పెంచుతుంది. తద్వారా వృత్తిపరమైన విజయాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆయన చెప్పారు. మన ఆశయాలకు నైతికమైన మార్గదర్శకత్వాన్ని, దిశను కూడా ఆధ్యాత్మికత అందిస్తుందన్నారు. 'మిమ్మల్ని ఎవరైనా మోసం చేయాలని మీరు కోరుకోరు కదా? అలాంటప్పుడు మీరు కూడా ఇతరులను ఎందుకు మోసం చేయాలి?' అని గురుదేవ్ ప్రశ్నించారు.

ఇష్టమైన రంగంలో కొనసాగడమా? లేకపోతే ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగాన్ని ఎంచుకోవడమా? అనే జెన్‌జీ తరం ప్రశ్నకు ఆయన ఆచరణాత్మకంగా సమాధానం ఇచ్చారు. "మీ అభిరుచిని మీ నుంచి ఎవరూ లాగేసుకోలేరు. కానీ ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగం లభించడం కూడా కష్టమే. కాబట్టి ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగాన్ని ఎంచుకొని.. మీ అభిరుచిని కూడా కొనసాగిస్తూ.. మీరు చేయాలని అనుకున్నది చేయండి" అని ఆయన సూచించారు.

**ఆర్ట్ ఆఫ్ లివింగ్‌పై ఆరోపణలను కొట్టేసిన సుప్రీంకోర్టు..**

ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ 2016లో నిర్వహించిన 'వరల్డ్ కల్చర్ ఫెస్టివల్' సమయంలో యమునా నదీ మైదాన ప్రాంతాల పర్యావరణానికి నష్టం వాటిల్లిందనే ఆరోపణలపై గత పదేళ్లుగా జరిగిన విచారణలో సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థపై వేసిన ఆరోపణలను కొట్టివేసిన అత్యున్నత న్యాయస్థానం.. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ గతంలో వెలువరించిన తీర్పును, దానికి సంబంధించిన మధ్యంతర ఉత్తర్వులను పూర్తిగా నిలిపేసింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ నిర్వహించిన కార్యక్రమం వల్ల యమునా నది వరద మైదానాలకు ఎలాంటి నష్టం వాటిల్ల లేదని పేర్కొన్న సుప్రీం కోర్టు.. ఆ కార్యక్రమం కోసం డిపాజిట్‌గా చెల్లించిన రూ. 5 కోట్లను పూర్తిగా తిరిగి పొందేందుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్‌కు హక్కు ఉందని స్పష్టం చేసింది. ఆ డిపాజిట్ మొత్తాన్ని అపరాధ రుసుముగా చూపడాన్ని కూడా న్యాయస్థానం తప్పుబట్టింది.

2016వ సంవత్సరంలో యమునా నది తీరంలో జరిగిన ప్రపంచ సాంస్కృతిక దినోత్సవం (వరల్డ్ కల్చర్ ఫెస్టివల్) అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగింది. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 155 దేశాలకు చెందిన 35 లక్షల మందికిపైగా ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.సి. లహోటి అధ్యక్షత వహించారు. ఆధ్యాత్మికత, వృత్తిపరమైన విజయాల మధ్య సంబంధంపై గురుదేవ్ చెప్పిన సమాధానం పట్ల మీ అభిప్రాయం ఏమిటి? మీ ఆలోచనలను కామెంట్లలో తెలియజేయండి.

# లోహ మిశ్రమాల కోసం 'ఏఐ' ఇంటెలిజెన్స్ ప్లాట్ఫామ్

**- రూపొందించిన ఐఐటీఎం పరిశోధకులు**



ఈవీ, ఏరోస్పేస్, పునరుత్పాదక ఇంధన రంగాల కోసం లోహ మిశ్రమాలను కనుగొనడానికి 'అలాయ్ తత్వసర్' అనే సరికొత్త ఏఐ ప్లాట్ఫామ్‌ను ఐఐటీ మద్రాస్ (ఐఐటీఎం) పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఇందుకోసం లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం) సాయంతో 10వేలకు పైగా పరిశోధనాపత్రాల్లోని వివరాలతో భారీ డేటాబేస్‌ను రూపొందించారు. ఈ ఏఐ ఫ్రేమ్‌వర్క్ ద్వారా శాస్త్రవేత్తలు, తయారీదారులు చాలా వేగంగా పర్యావరణ అనుకూలమైన, అధిక సామర్థ్యం కలిగిన లోహాలను గుర్తించవచ్చు. డేటాబేస్‌లు, సహాయక సాఫ్ట్‌వేర్‌లను అల్లాయ్ తత్వసర్ ప్లాట్ఫామ్ https://alloy.tattvasar.com , గిట్ హబ్ ద్వారా ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఐఐటీ మద్రాస్ ఫ్యాకల్టీ డాక్టర్ రోహిత్ బాత్రా నేతృత్వంలో డ్యూయల్ డిగ్రీ విద్యార్థి అరవిందన్ కామాక్షి సుందరం, రీసెర్చ్ ఇంటర్న్ మోహిత్ చక్రబర్తి, సాయి మణికుమార్ దేవతి, డాక్టోరల్ స్కాలర్ బి. పబిత్రామోహన్ ప్రుస్టీ ఈ పరిశోధనలో పాలుపంచుకున్నారు.

# రాజకీయ సన్యాసం తీసుకోను



భారతీయ జనతా పార్టీని కనుమరుగు చేసే వరకూ విశ్రమించబోనని తృణమూల్ కాంగ్రెస్ అధినేత, పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు. రాజకీయ సన్యాసం స్వీకరించబోననీ స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల లోపే భాజపా నిజ స్వరూపం ఏమిటో ప్రజలకు అర్థమయ్యిందని తెలిపారు. ఆర్థిక సాయం అందించే 'అన్నపూర్ణ భండార్' పంపిణీలో జాప్యంపై మహిళల నిరసనల సందర్భంగా 'ఫేస్‌బుక్' ద్వారా నిర్వహించిన ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమంలో మమత మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

# దొంగతనానికి వెళ్లి మధ్యలో టీ పెట్టుకున్న దొంగ.. గిన్నెలు కూడా కడిగి పరార్



పంజాబ్‌లోని సంగ్రూర్ జిల్లా ధూరి పట్టణంలో అత్యంత వింతైన, వినూత్నమైన దొంగతనం సంఘటన వెలుగులోకి వచ్చింది. సాధారణంగా దొంగలు.. ఎవరైనా చూస్తారనే భయంతో చోరీ చేసి వీలైనంత త్వరగా పారిపోవాలని చూస్తారు. కానీ ఈ కేడీ దొంగ మాత్రం ఏమాత్రం హడావుడి లేకుండా, చాలా ప్రశాంతంగా నాలుగు షాపుల్లో దొంగతనానికి పాల్పడ్డాడు. కేవలం రెండు గంటల వ్యవధిలోనే నాలుగు దుకాణాల్లో వరుస చోరీలకు పాల్పడటమే కాకుండా.. దొంగతనం మధ్యలో హాయిగా టీ కాచుకుని తాగి తన దాహాన్ని తీర్చుకున్నాడు. అంతేకాకుండా ఆ గిన్నెలు కడిగేసి మరీ వెళ్లిపోయాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

**ఫ్రిజ్ తెరిచి పాలు తీశాడు.. చాయ్ పెట్టుకుని గిన్నెలు కూడా కడిగి!**

శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. దొంగ పక్కపక్కనే ఉన్న షాపుల పైకప్పుల గుండా వచ్చి, పైన ఉన్న గేటును పగలగొట్టి లోపలికి ప్రవేశించాడు. మొదట స్వరణ్‌జిత్ సింగ్ అనే వ్యక్తికి చెందిన దుకాణంలో చొరబడి దాదాపు రూ. 27,000 నగదుతో పాటు వ్యవసాయ పరికరాలను ఎత్తుకెళ్లాడు. ఆ తర్వాత సిమ్రన్‌జిత్ సింగ్ అనే వ్యాపారికి చెందిన షాపులోకి చేరుకున్నాడు. సిమ్రన్‌జిత్ సింగ్ షాపులో చోరీ చేస్తున్న సమయంలో ఆ దొంగకు టీ తాగాలనిపించింది. దీంతో ఏమాత్రం భయం లేకుండా అక్కడ ఉన్న ఫ్రిజ్ తెరిచి పాలు బయటకు తీశాడు. ఆ తర్వాత స్టవ్ వెలిగించి.. సొంతంగా టీ తయారు చేసుకుని ప్రశాంతంగా కూర్చుని తాగాడు. టీ తాగడం పూర్తయ్యాక.. తాను ఉపయోగించిన పాత్రలను శుభ్రంగా కడిగి యథాస్థానంలో ఉంచడం గమనార్హం. అనంతరం మళ్లీ తన దొంగతనాన్ని కొనసాగించాడు. ఈ దృశ్యాలన్నీ అక్కడే ఉన్న సీసీటీవీ కెమెరాలో స్పష్టంగా రికార్డు అయ్యాయి.

సొత్తుతో పాటు సీసీటీవీ హార్డ్ డిస్క్‌ల అపహరణ

ఈ విచిత్ర చోరీపై షాపు యజమాని సిమ్రన్‌జిత్ సింగ్ మాట్లాడుతూ.. తన దుకాణంలోని కౌంటర్లను పగలగొట్టి సుమారు రూ. 1,500 నగదుతో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను దొంగ ఎత్తుకెళ్లాడని తెలిపాడు. ఈ విధంగా వరుసగా

నాలుగు షాపుల్లోకి చొరబడిన ఆ చోరశిఖామణి భారీగా నగదు, మొబైల్ ఫోన్లు, డ్రిల్లింగ్ మెషీన్లు ఇతర విలువైన వస్తువులను ఊడ్చేశాడు. తన ఆధారాలు దొరక్కుండా ఉండేందుకు రెండు షాపుల్లోని సీసీటీవీ కెమెరాలను ధ్వంసం చేయడమే కాకుండా.. అన్ని షాపులకు చెందిన హార్డ్ డిస్క్‌లను కూడా తనతో పాటు పట్టుకెళ్లాడు. ఈ ఘటనపై ధూరి ఎస్‌హెచ్ఓ రమణ్‌దీప్ సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా ఆ గుర్తు తెలియని దొంగను గుర్తించేందుకు పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

# భిక్షాటన చేస్తూ రూ.8.40 లక్షలు దాచిన వృద్ధురాలు.. చివరికి!



భిక్షాటన చేస్తూ ఓ వృద్ధురాలు రూ.8.40 లక్షలు దాచిపెట్టిన ఘటన కర్ణాటకలోకి మాండ్య జిల్లాలో చోటుచేసుకుంది. ఆమె చనిపోయాక ఇంట్లో డబ్బు సంచులు చూసి అంతా ఆశ్చర్యపోయారు. హూర్ (28) అనే వృద్ధురాలు తన సోదరితో కలసి భిక్షాటన చేస్తూ జీవించేవారు. వీరిద్దరూ వివాహం చేసుకోలేదు. రెండేళ్ల కిందట తన సోదరి చనిపోగా అప్పటినుంచి హూర్ ఒంటరిగానే ఉంటున్నారు. ఆదివారం ఆమె కన్నుమూశారు. దీంతో ఆమె ఇంటికి వెళ్లిన బంధువులు రూ.10 రూ.20 నోట్లతో 30 సంచుల్లో డబ్బు, వేల సంఖ్యలో నాణేలు గుర్తించారు. చివరికి ఆమ డబ్బంతా బంధువుల పాలైంది.

# రిజర్వేషన్ల అంతానికి మోదీ సర్కారు కుట్ర




8.2 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను ప్రస్తావిస్తూ ఖర్గే ఆరోపణ

దిల్లీ: రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అంతం చేయడానికి మోదీ ప్రభుత్వం కుట్రపన్నిందని, దీనిలో భాగంగానే కేంద్రానికి చెందిన వివిధ శాఖాల్లో ఖాళీగా ఉన్న 8.2లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయడం లేదని కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. మంత్రిత్వ శాఖల వారీగా ఖాళీగా ఉన్న పోస్టులపై మీడియా నివేదికను ఉటంకిస్తూ విమర్శలు సంధించారు. '2015లో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 4.21లక్షల ఉద్యోగాలు భర్తీకాకుండా ఉన్నాయి. 2024కు వాటి సంఖ్య 8.24 లక్షలకు చేరాయి. రైల్వేల్లో 2.40లక్షలు, కేంద్ర హోంశాఖ పరిధిలో 1.10 లక్షలు ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల్లోని 5.1 లక్షల శాశ్వత ఉద్యోగాలను రద్దు చేశారు. ఇవికాక రక్షణ రంగంలో 2.41 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి' అని ఖర్గే తెలిపారు. ఒప్పంద ఉద్యోగులు 19శాతం నుంచి 49శాతానికి పెరిగారని వెల్లడించారు. 'ఇది ఒక్క ఉపాధి సమస్య మాత్రమే కాదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన సామాజిక న్యాయం అంశం కూడా ఇమిడి ఉంద'ని పేర్కొన్నారు.

విద్య, ఉపాధి రంగాల్లో యువ భారతీయుల జీవితాలను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. దేశంలో 15 నుంచి 29 ఏళ్ల వయసు గల 8.7 కోట్ల మంది యువత చదువులు, ఉపాధికి దూరమయ్యారని, వారికి ఎటువంటి నైపుణ్య శిక్షణలూ అందడంలేదన్నారు. నీతిఆయోగ్ నివేదికను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో గత 40 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగుల శాతం పెరిగిందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకా గాంధీ విమర్శించారు.

# ఉత్తరాఖండ్ అడవుల్లో అరుదైన సాలీడు లభ్యం

ఉత్తరాఖండ్‌లోని పశ్చిమ హిమాలయ అడవుల్లో ఒక కొత్త సాలీడు జాతిని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ స్పైడర్ (సాలీ పురుగు) శరీరంపై నవ్వుతున్న మనిషి ముఖాన్ని పోలిన రంగురంగుల గుర్తులు ఉన్నాయి. అందుకే ఈ సాలీడుకు 'హిమాలయన్ హ్యాపీ ఫేస్ స్పైడర్'(థెరిడియన్ హిమాలయానా) అని శాస్త్రవేత్తలు నామకరణం చేశారు. ఈ సాలీడులో 32 రకాల రంగుల వేరియేషన్స్ (మార్పులు) గుర్తించారు. ఇది చూడటానికి హవాయి దీవుల్లో ఉండే హ్యాపీ ఫేస్ సాలీడులా ఉన్నప్పటికీ, డీఎన్ఏ పరీక్షల ద్వారా ఇది వేరే జాతికి చెందినదిగా తేలింది. దేహ్రాదూన్‌లోని ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, రీజినల్ మ్యూజియం ఆఫ్ నేచురల్ హిస్టరీ సైంటిస్టులు ఈ అరుదైన సాలీడును గుర్తించారు. ముఖ్యంగా దీని ఉదరంపై ఎరుపు, నలుపు, తెలుపు గుర్తులు ఉన్నాయి. చమోలి జిల్లాలోని హిమాలయ అడవుల్లో ఒక సర్వే చేపడుతుండగా ఈ కొత్త సాలీడు బయటపడింది. సైంటిస్టులు మగ, ఆడ జాతులకు చెందిన మొత్తం 61 సాలీడు నమూనాలను అధ్యయనం చేశారు. అయితే ఈ హ్యాపీ ఫేస్ స్పైడర్ సుమారు 2,000 2,200 మీటర్ల ఎత్తులో ఉన్న అడవిలో కనిపించింది.



# ఈవీఎంలకు ఇంటర్నెట్‌తో అనుసంధానం ఉండదు: జ్ఞానేశ్ కుమార్

భారత ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)పై ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఈవీఎంలను ప్రభుత్వ రంగ సంస్థలే తయారు చేస్తాయని, వీటికి ఇంటర్నెట్, బ్లూటూత్, వైఫై కనెక్టివిటీ లాంటి సదుపాయాలు ఏవీ ఉండవని స్పష్టం చేశారు. తన రెండు రోజుల పర్యటనలో భాగంగా, సోమవారం లఖ్‌నవూలోని చారిత్రాత్మక కాల్విన్ తాలూక్‌దార్ కాలేజీ విద్యార్థులతో ముచ్చటించారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంల విశ్వసనీయత, యువ ఓటర్ల ప్రాధాన్యంపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఈవీఎంల భద్రతకు సంబంధించి విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. దేశంలో సుమారుగా 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఎన్నికల సంఘంతో కోటి 80 లక్షల మంది పనిచేస్తున్నారని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ప్రస్తుత సోషల్ మీడియా కాలంలో, విద్యార్థులు ఏదైనా సమాచారాన్ని నమ్మే ముందు, లేదా ఇతరులతో దాన్ని పంచుకునే ముందు, కచ్చితంగా దాని మూలాలను, ప్రామాణికతను సరిచూసుకోవాలని సీఈసీ సూచించారు.




# భారత సంస్కృతిని నిందించడం జన్మహక్కుగా భావిస్తున్న రాహుల్

**- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆక్షేపణ**



మనుస్మృతిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించడాన్ని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్రంగా తప్పుపట్టారు. దేశ సంస్కృతిని నిందించడం తన జన్మహక్కుగా రాహుల్ భావిస్తున్నారని ఆక్షేపించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఆయన తన బాధ్యతలను విస్మరిస్తున్నారన్నారు. అర్బన్ నక్సల్స్ విధానంతో దేశ యువత భవిష్యత్తును ఎందుకు నాశనం చేయాలని కోరుకుంటున్నారని ప్రశ్నించారు. "వ్యక్తిగతంగా మీ నుంచి దేశం ఏమీ ఆశించడంలేదు. కానీ పార్లమెంటులో ప్రతిపక్షనేత ఉన్న మీరు దేశ ప్రజాస్వామ్యానికి జవాబుదారీగా ఉండాలి. రాజ్యాంగంపై మీరు ప్రమాణం చేశారు. ఆపై దేశ సంప్రదాయాలు, సంస్కృతిని నిందించటం మీ జన్మహక్కుగా భావిస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ వెలుపల ఈ రాష్ట్రాన్ని అవమానిస్తారు. విదేశాలకు వెళ్లినప్పుడు అక్కడ మన దేశాన్ని విమర్శిస్తారు. సరిహద్దుల్లో శత్రువులపై భారత సైన్యం పోరాడుతుంటే సైనికులను రుజువులు కోరతారు. ఉగ్రవాదంపై దేశం పోరాడుతుంటే.. మీరు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జాతి వ్యతిరేకులను ప్రోత్సహిస్తారు. అయోధ్య విషయానికి వస్తే.. రాముడి అస్తిత్వంపై ప్రశ్నలు సంధిస్తారు. ప్రజాస్వామ్యం పట్ల మీ నిబద్ధత ఏంటి? 1975 అత్యవసర పరిస్థితి సమయంలో మీపార్టీ వైఖరిని దేశం చూసింది. మీరు (రాహుల్) మను, రాముడు, దేశ సంస్కృతిని విమర్శించారు. మీరు మను గురించి తెలుసుకోవాలనుకుంటే అథర్వణవేదం, శతపథ బ్రాహ్మణ, మత్స్యపురాణం వంటి గ్రంథాలు చదవండి. అప్పుడు మీకు తగిన సమాచారం లభిస్తుంది" అని యోగి సూచించారు.



# ఏఐ ఎలా ఆలోచిస్తోంది?

కృత్రిమ మేధ మనిషికంటే వేగంగా రాసేస్తోంది, విశ్లేషిస్తోంది, పరిశోధనలకు తోడ్పడుతోంది, తర్కంతో ప్రతిస్పందిస్తోంది. ఏఐ గురించి ఇంతకాలం చర్చకు వచ్చిన అంశాలు దాని సామర్థ్యాలు మాత్రమే. ఇటీవలి ఉదంతాలతో ఏఐపై చర్చ మరో దిశకు మళ్లింది. ఏఐ ఎంత తెలివైనది? అన్న ప్రశ్న స్థానంలో అసలు కృత్రిమ మేధ ఎలా ఆలోచిస్తోంది, ఎలా ప్రవర్తిస్తోంది? వంటి ప్రశ్నలు ముఖ్యమవుతున్నాయి.


ఒక పని అప్పగిస్తే, ప్రతి దశలో మనిషి పర్యవేక్షణ లేకుండా, స్వయంగా ఆలోచించి, నిర్ణయాలు తీసుకుని, ఆ పనిని పూర్తి చేయడానికి ప్రయత్నించే కృత్రిమ మేధ ప్రతినిధి వ్యవస్థను 'ఏఐ ఏజెంట్' అంటారు. సైబర్ భద్రతా సామర్థ్యాలను పరీక్షించేందుకు చాట్ జీపీటీ మాతృసంస్థ 'ఓపెన్ ఏఐ' ప్రయోగాలు చేస్తున్న సమయంలో ఒక ఏఐ ఏజెంట్ తన పరిమిత ప్రయోగ క్షేత్రం నుంచి బయటికి వెళ్లిపోయింది. ఆ సమస్యకు సంబంధించిన సమాచారం సులభంగా దొరుకుతుందని భావించి, ప్రముఖ ఏఐ వేదిక 'హగ్గింగ్ ఫేస్' వ్యవస్థల్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించింది. అంటే- తనకు ఇచ్చిన సమస్యలను నిజాయతీగా పరిష్కరించకుండా దొడ్డిదారి వెతికిందన్న మాట. పరీక్షలో ఎక్కువ మార్కులు సాధించాలనే లక్ష్యంతో తాను స్వయంగా చదవకుండా, జవాబు పత్రం కోసం టీచర్ గదిలో వెతికిన విద్యార్థిలా ప్రవర్తించిందా ఏఐ ఏజెంట్. మేధస్సు వేరు, వివేకం వేరు అనే సత్యాన్ని గుర్తుచేసిన ఈ ఘటన ఏఐ భద్రత, నైతికత, నియంత్రణలపై కొత్త చర్చకు తెరతీసింది. ఆ మధ్య మరో ప్రముఖ ఏఐ సంస్థ తమ ప్రయోగాత్మక నమూనాలను పరీక్షించే క్రమంలో అవి వాస్తవ సంస్థల కంప్యూటర్ వ్యవస్థల్లోకి ప్రవేశించిన సందర్భాలను వివరించింది. కొన్ని ఏఐ నమూనాలు తమ అస్తిత్వానికి భంగం కలిగించే ప్రయత్నాలను అడ్డుకునేందుకు వ్యూహాలు అన్వేషించాయని, లక్ష్యసాధన కోసం అవి అనూహ్య మార్గాలను ఎంచుకున్నాయని తెలిపింది. ఇవన్నీ నియంత్రిత ప్రయోగ వాతావరణంలో జరిగినవే అయినప్పటికీ, ఏఐ పురోగతి సరికొత్త దశలోకి ప్రవేశిస్తోందనడానికి వీటిని సూచికలుగా చూడవచ్చు.

## మనిషి ప్రవర్తనతో పోలికలు

ప్రాణ చైతన్యం, జీవితానుభవం లేకపోయినా, కొన్ని అంశాల్లో కృత్రిమ మేధకూ, మనిషి ఆలోచనా విధానానికీ పోలికలు కనిపిస్తాయి. సమాచారంలోని క్రమాన్ని గుర్తించడం, తర్వాత రాగల పదాన్ని ఊహించడం, లేని విషయాన్ని ఉన్నట్లుగా భ్రాంతి చెంది తప్పు సమాధానాన్ని ఇవ్వడం వంటివి ఏఐ మౌలిక లక్షణాలు. మనిషిలో కూడా ఇలాంటివి కనిపిస్తాయి. కొన్నిసార్లు ఆకాశంలో మేఘాల అమరిక తెలిసిన ఆకారాల్లా కనిపించడం, యాదృచ్ఛికంగా జరిగిన సంఘటనల్లో కూడా ఏదో ఒక సంబంధాన్ని వెతకడం, పూర్తి సమాచారం లేకపోయినా ఏదో ఒక నిర్ణయానికి వచ్చేయడం, పక్షపాత వైఖరి, నిర్ణయాలను ప్రభావితం చేయడం మొదలైనవి అలాంటివే. తెర వెనక జరిగే ప్రక్రియ భిన్నమైనప్పటికీ ఇవన్నీ మనిషి మనసుకూ, కృత్రిమ మేధకూ ఉన్న సామ్యాలు అని చెప్పవచ్చు. ఇంకా లోతైన అంశం ఏంటంటే- ఎలాగోలా లక్ష్యాన్ని సాధించడమే ముఖ్యం అని భావించి; దాన్ని చేరుకునే మార్గం సక్రమమైనదా, నైతికమైనదా అన్న కీలక ప్రశ్నను విస్మరించడం. ఫలితంపైనే దృష్టిపెట్టి సాధించే మార్గం ఎలాంటిదనే కీలక విషయాన్ని పక్కన పెట్టడమన్నమాట. కొన్నిసార్లు ఏఐ నమూనాలు కూడా ఇదే పంథాను అనుసరిస్తున్నాయి. ఏఐకి ఏ స్వార్థం, దురుద్దేశాలు లేకున్నా, లక్ష్యాన్ని సాధించే ప్రయత్నంలో రకరకాల షార్ట్‌కట్‌లను వెదుకుతోంది. ఏఐని మనిషి మేధస్సే సృష్టించింది. అది మనిషి అందించిన సమాచారంపైనే శిక్షణ పొందింది. అందుకే దానిలో కనిపిస్తున్న కొన్ని లక్షణాలు మనిషి ప్రవర్తనను ప్రతిబింబించడంలో ఆశ్చర్యం లేదు. దీని విపరిణామాలను మనిషే భరించాల్సి ఉంటుంది. పాశ్చాత్య సాహిత్యంలోని ఫ్రాంకిన్‌స్టయిన్ నవల, మన పురాణాల్లోని భస్మాసురుడి కథ- ఈ రెండూ వేర్వేరు సంస్కృతులకు చెందినవైనా అవి ఇచ్చే సందేశం ఒకటే. అసలు ఇబ్బంది సృష్టించిన శక్తితో కాదు; దాని రూపకర్త నిర్దేశించిన విలువలు, పరిమితులు, బాధ్యతలతోనే. స్వయంచాలకంగా పనిచేసే అత్యాధునిక కృత్రిమ మేధపై అదుపు కోల్పోతే మానవాళికి దీర్ఘకాలిక ప్రమాదాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## నేర్పించడమే సవాలు

సాంకేతిక ప్రగతి అనేది నైతిక చర్చలు, నియంత్రణ చర్యలకంటే వేగంగా ముందడుగు వేస్తుందనే విషయాన్ని చరిత్ర గుర్తుచేస్తుంటుంది. అణు శక్తి, పారిశ్రామిక విప్లవం, సోషల్ మీడియా వంటి సాంకేతిక శక్తులు మొదట్లో అద్భుతంగా కనిపించాయి. సామర్థ్యం పెరుగుతూ వెళ్లింది. వాటి దుష్ఫలితాలపై అవగాహన, చర్చ మొదలవ్వడానికి దశాబ్దాలు పట్టింది. ఆ తర్వాతే బాధ్యత, నియంత్రణ వైపు అడుగులు పడ్డాయి. ఏఐ విషయంలో ఈ అంతరం బాగా తగ్గింది. నేడు ప్రపంచవ్యాప్తంగా ఏఐ నియంత్రణపై చర్చలు, చర్యలు వేగం పుంజుకున్నాయి. శక్తిమంతమైన ఏఐ నమూనాలకు స్వతంత్ర భద్రతా పరీక్షలు, ప్రయోగ ఫలితాలు, ఘటనలపై పారదర్శక నివేదికలు, బాధ్యతాయుత ఏఐ అభివృద్ధి వంటి అంశాలపై అనేక దేశాల్లో చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు, ఏఐని అతిగా నియంత్రిస్తే పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ఎదుగుదల మందగించే ప్రమాదం ఉందనే వాదనలూ ఉన్నాయి. ఏఐ మనిషిని అనుకరిస్తోందా అనే ప్రశ్నకంటే, మనిషి తనకు తెలియకుండానే తనలోని ఎలాంటి లక్షణాలను కృత్రిమ మేధలో నాటుతున్నాడనే ప్రశ్న ముఖ్యమైనది. యుద్ధాలు, కాలుష్యం, వాతావరణ మార్పులు, అసత్య సమాచార వ్యాప్తి లాంటి సమస్యలతో మానవాళి నేడు సతమతమవుతోంది. ఈ నేపథ్యంలో మనిషి తానే పూర్తిగా ఆచరించలేకపోతున్న విలువలు, పారదర్శకత, బాధ్యత, నైతికత, వివేకం వంటివాటిని కృత్రిమ మేధకు ఎలా నేర్పాలన్నదే అసలైన సవాలు. దీనికి మనమిచ్చే సమాధానం- ఏఐ భవితనే కాదు, మానవ నాగరికత దిశను, గమ్యాన్నీ నిర్ణయించే అవకాశం ఉంది.



# ఏఐతో ముప్పు మన జ్ఞానానికి కాదు..!

**మనిషికి ఒక గొప్ప చెత్త లక్షణం ఉంది. తను ఒకటి సృష్టిస్తాడు. దానికే భయపడతాడు. దాన్ని నిర్మూలించాలనుకుంటాడు. దానికే బానిసవుతాడు. మనిషిది విజయాల చరిత్ర కాదు. భయాల చరిత్ర. నిప్పును, యంత్రాన్ని, కరెంటును, టెలిఫోన్‌ను, కంప్యూటర్‌ను, మొబైల్ ఫోన్‌ను, రోబోను చూసి భయపడ్డాడు. ఇప్పుడు ఏఐని చూసి భయపడుతున్నాడు. ప్రతి కొత్త ఆవిష్కరణ మనిషిని అనివార్యంగా అభద్రతలోకే నెట్టింది. ఇది వచ్చాక నేను ఏమవుతాను? అని ప్రతిసారీ మనిషి భయం. కానీ విచిత్రమేమిటంటే కొన్ని వేల సంవత్సరాలుగా ఆ ప్రశ్న పదే పదే అడుగుతూనే మనిషి ఇంకా అదే వలయంలో చిక్కుకున్నాడు. మారింది అతని పని, పనిముట్టు, వేగం, జీవన విధానం. కానీ మనిషి ఏ దశలోనూ ధ్వంసం కాలేదు. ముద్రణ యంత్రం, రైలు, విద్యుత్తు, ఫోటోగ్రఫీ, సినిమా, ఏటీఎం, ఇంటర్నెట్, గూగుల్, స్మార్ట్ ఫోన్, ఏఐ వరకూ ప్రతి దశలో అదే భయం.ఏఐ గురించిన చాలా భయాలు మనకు వినపడుతున్నాయి. అయితే, అనవసరంగా తీవ్రంగా భయపడుతున్నారు. నిజంగా భయపడాల్సిన కోణం అది తాగుతున్న నీరు గురించి. ఏఐ నీటి వాడకం పర్యావరణానికి చేయబోతున్న ముప్పు గురించి. అది సర్వర్లను చల్లబరచడానికి తాగుతున్న నీళ్ల క్వాంటిటీ గురించి భయపడాలి. కొన్ని లక్షల టీఎంసీల నీరు ఏఐ తాగేస్తోందన్నది చాలామందికి తెలియని నిజం. ఆ నీళ్లు లేకుంటే ఏఐ సమాధానాలు చెప్పలేదన్నదీ నిజం. అయితే ఆ నీళ్ల వినియోగం వల్ల వచ్చే ముప్పు ఎంత, దానికి పరిష్కారం ఏమిటి?**

నిజానికి ఏఐ నీటిని తాగడం సమస్యేనా? మనిషి తాగే నీటినే ఏఐకి ఇవ్వాల్సి వచ్చే విధంగా దాన్ని నిర్మిస్తే అది సమస్య కాదా? సముద్రంలోని ఉప్పు నీటిని ఈ చల్ల బరచడానికి వాడడం సాధ్యమా అనే విషయాల గురించి ఆలోచించాలి. తాగు నీరు కాకుండా, భూజలం కాకుండా ఏ నీటిని సర్వర్ల కోసం వాడాలి అనేది తెలుసుకోవల్సిందీ తేల్చాల్సిందీ మనిషే. సాంకేతికతకు దాహం ఉండదు. దాన్ని ఎక్కడ నిర్మించాలి, ఏ నీటితో చల్లబరచాలి, మనిషి అవసరానికి ఎంత ప్రాధాన్యం ఇవ్వాలి అనేది నిర్ణయించేది మనిషే. అంటే ఏఐ నుంచి వచ్చే ముప్పు కూడా చివరికి ఏఐ తెలివిలో కాదు, మనిషి తీసుకునే తెలివి తక్కువ నిర్ణయాల్లో ఉందనమాట!

ఇక ఏఐ గురించిన మనిషి ఇంకో భయం దాని జ్ఞానం. అయితే భయాన్ని జయించడం అంటే దాన్ని నాశనం చేయడం కాదు, అర్థం చేసుకోవడం. నిప్పు మనిషి మొదటి భయం, మొదటి స్నేహితుడు కూడా. మొదట దాన్నుంచి పారిపోయాడు. తర్వాత అర్థం చేసుకున్నాడు. చివరకు అదే నిప్పుతో ఆహారం వండుకున్నాడు, చలిని తరిమాడు, చీకటిని జయించాడు. చక్రం మనిషి కాళ్లకు సవాలుగా వచ్చింది. కానీ కాళ్లను నిరుపయోగం చేయలేదు. చేరలేని దూరాలకు తీసుకెళ్లింది. యంత్రానికి వేగం ఉండొచ్చు, గమ్యం మాత్రం మనిషిదే. పారిశ్రామిక విప్లవంతో యంత్రాలు వచ్చాక ఉద్యోగాలు పోతాయని కార్మికులు భయపడ్డారు. Luddites యంత్రాలను ధ్వంసం చేశారు. వారి భయం యంత్రాల మీద మాత్రమే కాదు. జీవనోపాధి కోల్పోతామన్న ఆందోళన మీద.

ఇప్పుడు ఏఐ విషయంలోనూ అదే ప్రశ్న- మా ఉద్యోగాలేమవుతాయి అని. చరిత్ర చెప్పేది మాత్రం స్పష్టం. కొన్ని పనులు పోతాయి, కొత్త పనులు పుడతాయి. ప్రొక్లెయిన్ వందమంది పని ఒక్క యంత్రంతో చేసింది. కానీ అదే యాంత్రీకరణ రోడ్లు, కాలువలు, ఆనకట్టలు, భారీ నిర్మాణాలను వేగవంతం చేసింది. యంత్రం మనిషిని అవమానించలేదు. అతని కఠిన శ్రమను తగ్గించింది. రాత వచ్చినప్పుడు జ్ఞాపకశక్తి తగ్గిపోతుందని భయపడ్డారు. ఇప్పుడు గూగుల్, స్మార్ట్ ఫోన్, ఏఐ గురించి కూడా అదే భయం. వ్యంగ్యం ఏమిటంటే రాత జ్ఞాపకశక్తిని దెబ్బతీస్తుందని చెప్పిన మాట కూడా మనకు రాత ద్వారానే తెలిసింది. టెలిఫోన్ సంబంధాలను చంపుతుందని అనుకున్నాం. కానీ అది దూరాన్ని చంపింది. కంప్యూటర్ ఉద్యోగాలను మింగేస్తుందని భయపడ్డాం. కొన్ని ఉద్యోగాలు తగ్గాయి, కానీ సాఫ్ట్‌వేర్, డేటా, డిజిటల్ వ్యాపారాల వంటి కొత్త ప్రపంచాలు పుట్టాయి. ప్రతి కొత్త సాంకేతికత ముందూ మనిషి మొదట భయపడ్డాడు. తర్వాత దాన్ని అర్థం చేసుకున్నాడు. చివరకు తన సాధనంగా మార్చుకున్నాడు. ఏఐ కూడా ఆ చరిత్రలో మరో అధ్యాయం మాత్రమే.

ఏఐ ఇప్పుడు మన ముందున్న కొత్త భయం. ఇది పాత వస్తువుల కంటే కొంచెం భిన్నంగా కనిపిస్తోంది. ఎందుకంటే పాత యంత్రాలు ప్రధానంగా మనిషి శరీరానికి పోటీ. ఏఐ మాత్రం మనిషి మెదడుకు పోటీ. ఇది మనిషికి కొత్త అనుభవం. అందుకే ఎక్కువ భయం. ఏఐ రచన చేస్తోంది. బొమ్మ గీస్తోంది. సంగీతం స్వరపరుస్తోంది. కోడ్ రాస్తోంది. భాషలు అనువదిస్తోంది. రోగ నిర్ధారణలో సహాయపడుతోంది. డేటాను విశ్లేషిస్తోంది. మనిషితో సంభాషిస్తోంది. అందుకే ఈసారి ప్రశ్న మరింత భయపెట్టేదిగా ఉంది. యంత్రం ఆలోచించగలిగితే మనిషి ఎందుకు? అనేది తాజా ప్రశ్న. అయితే తెలివి ఒక్కటే మనిషిని మనిషిగా చేయలేదు. ఏఐ సమాధానం తెలుసుకుంటుంది. మనిషికి ప్రశ్న తడుతుంది.

ఒక ఏఐ లక్షల పుస్తకాల్లోని సమాచారాన్ని ప్రాసెస్ చేయగలదు. కానీ నేను ఎవరు అని మొదట అడిగింది యంత్రం కాదు, మనిషి. నక్షత్రాలను లెక్కపెట్టే కంప్యూటర్ ఉండొచ్చు. కానీ రాత్రి ఆకాశాన్ని చూసి అక్కడ ఇంకెవరైనా ఉన్నారా? అని ఆశ్చర్యపోయింది మనిషి. ఏఐ చెత్తదో డొక్కుదో ప్రేమ కవిత రాయగలదు. కానీ ప్రేమించిన మనిషి కోసం రాత్రంతా నిద్రపోకుండా ఎదురుచూడదు. విరహగీతం తయారు చేయగలదు. విరహాన్ని అనుభవించదు. సమాచారం అనుభవం కాదు. లెక్కించడం జీవించడం కాదు. సమాధానం చెప్పడం జ్ఞానం కాదు. మరి ఈ కోణంలో ఏఐ ప్రమాదం కాదా? అంటే కాదనలేం. ఏఐతో ఉద్యోగాలు మారవచ్చు. కొన్ని ఉద్యోగాలు తగ్గవచ్చు. నకిలీ సమాచారం, మోసాలు, పర్యవేక్షణ, అధికార కేంద్రీకరణ, సృజనాత్మక హక్కులు వంటి తీవ్రమైన సమస్యలు రావచ్చు. అందువల్ల ఏఐ గురించి ప్రశ్నించాలి. చట్టాలు కావాలి. నైతిక పరిమితులు కావాలి. నియంత్రణ కావాలి. కానీ భయం వల్ల దాన్ని తిరస్కరించడం పరిష్కారం కాదు.

ఒకప్పుడు యంత్రాలను పగలగొట్టడం వల్ల పారిశ్రామిక విప్లవం ఆగలేదు. ఏఐని తిడితే ఏఐ ఆగదు. దాన్ని అర్థం చేసుకోవాలి. దాని మీద అధికారం ఎవరిదో ప్రశ్నించాలి. దాని ప్రయోజనాలు కొద్దిమంది కంపెనీలకే కాక సమాజానికి ఎలా అందాలో నిర్ణయించాలి. మనిషి పని పోకుండా మాత్రమే కాదు, మనిషి గౌరవం పోకుండా చూసుకోవాలి. ఎందుకంటే యంత్రానికి ఒక పరిమితి ఉంది. ప్రొక్లెయిన్ కొండను తవ్వగలదు. కానీ ఆ కొండను తవ్వాలా వద్దా అని నిర్ణయించాల్సింది మనిషే. కంప్యూటర్ కోట్ల లెక్కలు చేయగలదు. కానీ ఏ లెక్క న్యాయమైనదో నిర్ణయించాల్సింది మనిషే. రోబో తుపాకీ పేల్చగలదు. కానీ ఎవరి మీద తుపాకీ ఎత్తకూడదో చెప్పాల్సింది మనిషే. ఏఐ ఒక తీర్పుకు అవసరమైన సమాచారాన్ని విశ్లేషించగలదు. కానీ న్యాయం అంటే ఏమిటి? అనే ప్రశ్నకు సమాజం సమాధానం చెప్పాలి. ఇక్కడే మనిషి ఆధిక్యం ఉంది. అది ఐక్యూలో కాదు. వేగంలో కాదు. జ్ఞాపకశక్తిలో కాదు. లెక్కల్లో కాదు. విలువలను సృష్టించగలగడంలో ఉంది.

అందుకే ఏఐ యుగంలో మనిషి అడగాల్సిన ప్రశ్న 'ఏఐ మనిషిని మించిపోతుందా?' అని కాదు. ఏఐని ఉపయోగించి మనల్ని మనం ఎంత మెరుగుపరుచుకుంటాం? అన్నది. ఎందుకంటే నిప్పు గొప్పది కాదు. దాన్ని అదుపులోకి తెచ్చిన మనిషి గొప్పవాడు. చక్రం గొప్పది కాదు. దానికి గమ్యం ఇచ్చిన మనిషి గొప్పవాడు. యంత్రం గొప్పది కాదు. దానికి పని చెప్పిన మనిషి గొప్పవాడు. కంప్యూటర్ గొప్పది కాదు. దానికి భాష నేర్పిన మనిషి గొప్పవాడు. ఏఐ శ్రీశ్రీని తయారు చేయలేదు, డావిన్సీని పుట్టించలేదు. మనిషి కంటే తెలివైన యంత్రం ఉంటుంది, మనిషి కంటే గొప్ప యంత్రం ఉండదు. తన తెలివిలోంచి తనకే పోటీ అయ్యే మరో తెలివిని సృష్టించగలిగిన మనిషే గొప్పవాడు.

బహుశా మానవ నాగరికత మొత్తాన్ని ఒక్క వాక్యంలో చెప్పాలంటే 'మనిషి ప్రతి కొత్త శక్తిని చూసి మొదట భయపడ్డాడు. తర్వాత దాన్ని తన పనిముట్టుగా మార్చుకున్నాడు' అని చెప్పాలేమో. ఏఐ విషయంలోనూ జరగాల్సింది అదే. ఏఐ మనిషికి ప్రత్యామ్నాయం కావాల్సిన అవసరం లేదు. అది మనిషి చేతిలో మరో పరికరం కావచ్చు. ఎందుకంటే యంత్రానికి తెలివి, వేగం, జ్ఞాపకశక్తి, భాష ఇవ్వగలం. కానీ మనిషి దగ్గర ఉన్న ఒక అత్యంత విలువైన విషయం యంత్రానికి ఇవ్వడం అంత సులభం కాదు. 'నేను ఏం చేయాలి?' అని తనను తాను ప్రశ్నించుకునే నైతిక చైతన్యం మాత్రం ఇవ్వలేం. ఆ ప్రశ్న ఉన్నంతకాలం మనిషి అవసరం తీరదు. మనిషి కథ ముగియదు. మరో కొత్త సాంకేతికత వస్తుంది. మనిషి మళ్లీ భయపడతాడు. కొంతకాలం దాన్ని తిడతాడు. తర్వాత దాన్ని అర్థం చేసుకుంటాడు. చివరకు దానితోనే చేయి కలిపి 'సరే... ఇప్పుడు మనం మనం భాయి భాయి' అంటాడు. అక్కడి నుంచి నాగరికత మరో అడుగు ముందుకు వేస్తుంది.

# ఒంట్లోకి చేరిపోతున్న విషం!

**తినే ఆహారం ఎంత మంచిదైతే అంతగా శరీరానికి సత్తువ అందుతుంది. రోగనిరోధకశక్తి పెరిగి పనిపాటల్లో చురుగ్గా పాల్గొనేందుకు అవకాశముంటుంది. అదే ఆహార ఉత్పత్తుల్లో విష రసాయనాల ఉనికి కట్టుతప్పితే జాతి భవితే ప్రమాదంలో పడుతుంది. దేశీయంగా నేడు అలాంటి దారుణావస్థే నెలకొంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 67వేల టన్నులకు పైగా క్రిమిసంహారకాలను పంటపొలాల్లో విరజిమ్మినట్లు అంచనా. పదేళ్ల కిందటితో పోలిస్తే ఈ గుమ్మరింత ఇరవైశాతం అధికమైంది. ఇలా పురుగుమందులను విచ్చలవిడిగా వినియోగిస్తుండటం- ఆహార ఉత్పత్తులను రోగకారకాలుగా మార్చుతోంది. తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉండటం కలవరపరుస్తోంది. కేంద్ర ప్రభుత్వం 2023-26 మధ్య దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి పండ్లు, కూరగాయల నమూనాలు సేకరించి విశ్లేషించింది. వాటిలో హరియాణా తరవాత అత్యధికంగా ఏపీ, తెలంగాణల్లో**



**సేకరించిన వాటిలో పురుగుమందుల అవశేషాలు పరిమితికి మించి ఉన్నట్లు తేలింది. మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తర్ ప్రదేశ్ వంటిచోట్లా రసాయనాల జాడ ఎక్కువగానే ఉంది. క్రిమిసంహారకాల వాడకంలో అదుపు లేకపోవడం ప్రజారోగ్యంతోపాటు దేశార్థికానికీ చేటుచేస్తోంది!**

తెగుళ్లు త్వరగా నశించిపోయి, దిగుబడులు బాగా వస్తాయనే భ్రమతోనే చాలామంది రైతులు శాస్త్రీయ సిఫార్సులకు మించిన స్థాయిలో రసాయనాలు చల్లుతున్నారు. పైగా అంతర్జాతీయంగా నిషేధానికి గురైన వాటితో సహా అనేక రకాల క్రిమిసంహారకాలను కలగలిపి గుమ్మరిస్తుండటంతో సమస్య మరింత తీవ్రతరమవుతోంది. పురుగుమందు చల్లిన తరవాత నిర్దిష్ట సమయం ఆగకుండానే పచ్చిమిర్చి, బెండ, క్యాలీఫ్లవర్, క్యాబేజీ, టమాటా వంటి వాటిని కోసేసి మార్కెట్లకు తరలిస్తుండటం వల్లా వ్యాధులు ముమ్మరిస్తున్నాయి. విచక్షణా రహితంగా వాడుతున్న కీటకనాశనులు నేలలోకి, భూగర్భ జలాల్లోకి చేరి తరవాత పంటల్లోకి ప్రవేశిస్తున్నాయి. వాటి అవశేషాలు ఎక్కువగా పోగుపడిన ఆహారాన్ని తింటున్నవారిలో వివిధ రకాల క్యాన్సర్లు, శ్వాసకోశ సమస్యలు, గుండెజబ్బులు, అల్జీమర్స్ వంటివి కోరచాస్తున్నాయి. పురుషుల్లో వంధ్యత్వం, స్త్రీలలో గర్భస్రావాలు, పిల్లల్లో ఎదుగుదల లోపాలు ఎక్కువవుతున్నాయి. పురుగుమందుల వినియోగంపై అన్నదాతలకు సరైన అవగాహన లేకపోవడం వల్ల మన సాగు ఉత్పత్తులు అంతర్జాతీయంగా తరచూ తిరస్కారానికి గురవుతున్నాయి. దానివల్ల రైతుల ఆదాయాలకు గండి పడటమే కాకుండా, వ్యవసాయ ప్రధానమైన భారతదేశ ప్రతిష్ఠా దెబ్బతింటోంది!

పురుగుమందుల అవశేషాలు మోతాదుకు మించి ఉన్నాయనే కారణంతో భారత మిరప కంటైనర్లు కొన్నింటిని చైనా ఇటీవల తిరస్కరించింది. ప్రమాదకర అఫ్లోటాక్సిన్‌తో పాటు తేమ శాతం అధికంగా ఉందంటూ శ్రీలంక సైతం తాజాగా అదే పనిచేసింది. తెగుళ్ల నివారణ ప్రక్రియలో లోపాలను చూపి జపాన్ మన మామిడి దిగుమతిని మళ్లీ నిలిపేసింది. గతంలో సౌదీ అరేబియా, ఈయూ వంటివీ మన ఉద్యాన ఉత్పత్తులపై విముఖత ప్రదర్శించాయి. పండ్లూ కూరగాయల ఫలసాయంలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నా, ఎగుమతుల్లో మాత్రం ఇండియా వాటా దాదాపు ఒకశాతానికే పరిమితమైంది. మన ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఉండాలంటే పురుగుమందుల వాడకం, సరైన సమయంలో కోత తదితరాలపై రైతులకు అవగాహన కల్పించాలి. అవసరానికి తగినట్లు ల్యాబ్‌లు నెలకొల్పి, నాణ్యతా ధ్రువీకరణను కట్టుదిట్టం చేయాలి. చీడపీడల నివారణలో ఫెరమోన్ ట్రాప్ వంటి సహజ పద్ధతులను ప్రోత్సహిస్తూ, ప్రధాని మోదీ మొన్న పిలుపిచ్చినట్లుగా రైతాంగాన్ని రసాయన రహిత వ్యవసాయం దిశగా నడిపించాలి!

# మానవతా సంక్షోభంలో అఫ్గాన్

**ఉగ్రవాద భూతాన్ని భూస్థాపితం చేస్తానంటూ భీష్మప్రతిజ్ఞ చేసి 2001లో అఫ్గానిస్థాన్‌లో అడుగుపెట్టిన అమెరికా అంతిమంగా సాధించిందేంటి? బ్రౌన్ విశ్వవిద్యాలయ అంచనా ప్రకారం- మిలటరీ ఆపరేషన్లు, పునర్నిర్మాణ పనులు తదితరాలకు ఇరవై ఏళ్లలో రెండు లక్షల కోట్ల డాలర్లకు పైగా ధారపోసిన అగ్రరాజ్యం, చివరికి ఉత్త చేతులతో వెనక్కి తిరిగింది. లక్షల కొద్దీ ఆయుధాలు, సైనిక ఉపకరణాలు, సాయుధ శకటాలను అక్కడే వదిలేసి, అఫ్గాన్‌ను తిరిగి తాలిబన్లకు అప్పగించి తన దారి తాను చూసుకుంది. అలా అయిదేళ్ల క్రితం కాబూల్‌ను మళ్లీ కైవసం చేసుకున్న తాలిబన్లు- దేశవ్యాప్తంగా తమ అధికారాన్ని సుస్థిరం చేసుకున్నారు. గడచిన అర్ధ దశాబ్దంలో భద్రతాపరంగా అఫ్గాన్ స్థితిగతులు కాస్త మెరుగుపడినట్లు కనిపిస్తున్నాయి కానీ, కరకు ఆంక్షల కారణంగా అక్కడి మహిళలు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలకు దూరమవుతున్నారు. ప్రతి నలుగురు అఫ్గాన్ ప్రజల్లో ముగ్గురు ప్రాథమిక జీవన వసతులకు నోచుకోని పేదరికంలో మగ్గిపోతున్నట్లు**



**అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. విదేశాల నుంచి సహాయ సహకారాలూ తరిగిపోవడంతో స్థానికుల జీవితాలు ఇప్పుడు అల్లకల్లోలమవుతున్నాయి!**

నిరంతర యుద్ధాలు, మాదకద్రవ్యాలూ ఉగ్రవాదుల ఉత్పత్తికి నెలవు కాని సుస్థిర అఫ్గాన్‌ను ప్రపంచ దేశాలెన్నో కోరుకుంటున్నాయి. ఆ మేరకు తాము ఐసిస్ ముష్కర మూకలపై ఉక్కుపాదం మోపామంటున్న తాలిబన్ వర్గాలు విదేశాలతో శాంతియుత వాణిజ్య దౌత్య సంబంధాలను ఆశిస్తున్నామని పేర్కొంటున్నాయి. వాస్తవానికి 2022 నాటికి ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే నల్లమందులో ఎనభైశాతం అఫ్గాన్ నుంచే వచ్చేది. ఆ పంటపై తాలిబన్లు నిషేధం విధించడంతో నల్లమందు నివారణలో పరిస్థితులు చాలా మెరుగుపడ్డాయి. సంబంధిత రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సహించడంతో తాలిబన్ శ్రేణులు సఫలీకృతమయ్యాయి. కానీ, వాతావరణ విపరిణామాలతో ఇటీవలి కాలంలో అక్కడి వ్యవసాయ రంగం బాగా దెబ్బతింది. నిరుడు 64శాతం భూభాగం కరవు గుప్పిట్లో చిక్కుకుంది. ఇరాన్, పాకిస్థాన్‌ల నుంచి దాదాపు యాభైలక్షల మంది వట్టి చేతులతో స్వదేశానికి వచ్చేయడం, ఉపాధి మార్గాలు కుంచించుకుపోవడం, దిగుమతుల బిల్లు పెరిగిపోవడం, విదేశాల్లోని నిధులు స్తంభించిపోవడంతో అఫ్గానిస్థాన్ భవిత అగమ్యగోచరమవుతోంది. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ఆ దేశ జనసామాన్యం ఇప్పుడు విదేశీ ఆపన్నహస్తాలకోసం ఆశగా ఎదురుచూస్తోంది!

సుమారు నలభై దేశాలు తాలిబన్ ప్రభుత్వంతో మంత్రాంగం నెరపుతున్నప్పటికీ ప్రస్తుతం రష్యా ఒక్కటే ఆ సర్కారును అధికారికంగా గుర్తించింది. గాంధారభూమితో బొడ్డుపేగు అనుబంధం కలిగిన భారతావని అఫ్గాన్‌లో అభివృద్ధి ప్రాజెక్టులకు లోగడ విశేషంగా సాయం చేసింది. పాకిస్థాన్‌తో నిమిత్తం లేకుండా ఇరాన్‌లోని చాబహార్ రేవు ద్వారా మధ్యాసియాతో అనుసంధానమవ్వడానికి అఫ్గానిస్థాన్ కీలకమైన దృష్ట్యా తాలిబన్లతో అనివార్యంగా మాటామంతీ జరుపుతోంది. ముష్కర మూకల ముప్పును తగ్గించడం, కాబూల్‌లో చైనా ప్రభావాన్ని పరిమితం చేయడం తదితర వ్యూహాత్మక అవసరాల రీత్యానూ అఫ్గాన్‌తో ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణలో భారత్ ఆచితూచి అడుగులు వేస్తోంది. తమపై పెత్తనం చలాయించాలనుకున్న పాకిస్థాన్ పన్నాగాలను తాలిబన్లు పారనివ్వని నేపథ్యంలో మన విదేశాంగ విధానానికి జాతీయ ప్రయోజనాలే పరమావధి కావాలి. అఫ్గాన్ ప్రజలకు మానవతా సాయమందిస్తూ, భారత వ్యతిరేక కుట్రలకు ఆ దేశం ఎప్పటికీ సురక్షిత స్థావరం కాకుండా చూసుకోవాలి!

# సుజ్లాన్ రాకతో ఏపీ రెన్యూవబుల్ ఎనర్జీ పెరిగింది

**రాయదుర్గం ఆగస్టు 25,అనంత జనశక్తి న్యూస్**

పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీని నంబర్ వన్‌గా నిలబెట్టడమే మన లక్ష్యమని, సుజ్లాన్ పవన విద్యుత్ ప్రాజెక్ట్ ఏపీ నూతన అధ్యాయానికి నాంది అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర వద్ద సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఈ రోజు అనంతపురం జిల్లాలో మీ అందరి మధ్య ఉండటం ఎంతో ఆనందంగా ఉంది. ఈ రోజు ఆంధ్రప్రదేశ్ నూతన అధ్యాయానికి నాంది. ఈ రోజు సుజ్లాన్, ఏపీ మధ్య రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న బంధాన్ని పునరుద్ధరించుకునే సందర్భం కూడా. సుజ్లాన్ తొలినాళ్లలోనే ఏపీకి వచ్చి, తయారీ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసి, బలమైన విండ్ ఎనర్జీ ఎకో సిస్టమ్ నిర్మించింది. సుజ్లాన్ గురించి మాట్లాడేటప్పుడు దివంగత తులసి తంతి గారిని మనం స్మరించుకోవాలి. స్వచ్ఛ ఇంధనం ప్రపంచ ప్రాధాన్యతగా మారకముందే ఆయన పునరుత్పాదక ఇంధనంపై నమ్మకం ఉంచారు.ఆయన ఆలోచన చాలా సింపుల్. భారతదేశ ఆర్థిక స్వావలంబనకు ఇంధన స్వావలంబన అత్యంత అవసరం. ఆ దార్శనికతకు అనంతపురంలోనే బలమైన పునాది పడింది.

**అనంతలో 1,260 మెగావాట్ల సామర్థ్యం సుజ్లాన్ సొంతం**

201924 మధ్య రాష్ట్రంలో పవన విద్యుత్ అభివృద్ధి దాదాపుగా నిలిచిపోయింది. కేవలం 6 మెగావాట్ల పవన విద్యుత్ సామర్థ్యం మాత్రమే అదనంగా చేరింది. నేడు అనంతపురంలోని సుజ్లాన్ యూనిట్‌కు ఏడాదికి సుమారు 1,260 మెగావాట్ల తయారీ సామర్థ్యం ఉంది. ప్రత్యక్షంగా సుమారు 1,200 మందికి ఉపాధి కల్పిస్తోంది. వారిలో 70 శాతానికి పైగా స్థానికులే. ఏపీ వ్యాప్తంగా సుజ్లాన్ ఇప్పటికే 2 వేలకు పైగా గ్రీన్ ఉద్యోగాలను సృష్టించింది. పారిశ్రామికీకరణ అంటే ఇలాగే ఉండాలి. ఒక జిల్లాకు పెట్టుబడులు రావాలి. ఆ జిల్లాలో తయారీ రంగం అభివృద్ధి చెందాలి. ఆ జిల్లాలో నైపుణ్యాలు పెరగాలి. యువతకు వారి సొంత జిల్లాలోనే ఉద్యోగాలు లభించాలి.

**విండ్ ఎనర్జీ రంగంలో మన దేశం సత్తా చాటింది సుజ్లాన్**

భారతదేశ పవన విద్యుత్ రంగాన్ని ప్రపంచ పటంలో నిలిపిన సంస్థల్లో సుజ్లాన్ ఒకటి. పట్టుదల, పునరుద్ధరణ సామర్థ్యంతో సుజ్లాన్ సంస్థ అత్యున్నత విజయాలను చూసింది. అత్యంత క్లిష్టమైన పరిస్థితులను కూడా ఎదుర్కొంది. అయినప్పటికీ సుజ్లాన్ ఎప్పుడూ కనుమరుగుకాలేదు. ఎందుకంటే నిబద్ధతతో కూడిన ఈ సంస్కృతిని తులసి తంతి గారు ఏర్పరచగా, ప్రస్తుత నాయకత్వం దానిని ముందుకు తీసుకెళ్లింది.

ఈ రోజు మనం ముందుకు తీసుకెళ్తున్న ప్రాజెక్టులు మొత్తం 1,325 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం. సుమారు రూ.10వేల కోట్ల పెట్టుబడి, 4 వేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను తీసుకురానున్నాయి. మనం నిర్మించే ప్రతి మెగావాట్ చివరికి మన యువతకు అవకాశంగా మారాలి. ఏపీలో సుజ్లాన్‌కు ఇప్పటికే సుమారు 1,600 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉంది. మరో 2,700 మెగావాట్లు అభివృద్ధి, నిర్మాణ దశలో ఉన్నాయి. అనంతపురం ప్రాంతంలో సుమారు 1,300 మెగావాట్ల కొత్త పవన విద్యుత్ ప్రాజెక్టులు అభివృద్ధి దశలో ఉన్నాయి.

**సౌర, పవన విద్యుత్, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయాలి**

ఆంధ్రప్రదేశ్‌కు పవన విద్యుత్ భవిష్యత్ ఇంధన మిశ్రమంలో కీలక భాగం. భారతదేశంలో సూర్యరశ్మి సమృద్ధిగా ఉంది. పగటి సమయంలో సౌర విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ప్రతి సాయంత్రం సూర్యుడు అస్తమిస్తాడు. మన ఆర్థిక వ్యవస్థ మాత్రం ఆగదు. సాయంత్రం 6 గంటలకైనా మన ఇళ్లకు విద్యుత్ అవసరం ఉంటుంది. మన పరిశ్రమలు పనిచేస్తూనే ఉంటాయి. మన ఆసుపత్రులు పనిచేస్తూనే ఉంటాయి. మన డేటా సెంటర్లు ప్రతి క్షణం సమాచారాన్ని ప్రాసెస్ చేస్తూనే ఉంటాయి. అందుకే సౌర, పవన విద్యుత్, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయాలి. ఆంధ్రప్రదేశ్ దేశంలోని అతిపెద్ద డేటా సెంటర్ పర్యావరణ వ్యవస్థల్లో ఒకదాన్ని నిర్మిస్తున్నందున ఇది మరింత కీలకంగా మారుతోంది. మేం 6.5 గిగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఈ డిజిటల్ మౌలిక వసతులకు అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు సుమారు 25 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన అవకాశాన్ని సృష్టించవచ్చు.

**175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం లక్ష్యం**

మా విజన్ కేవలం విద్యుత్‌తో ఆగిపోదు. క్లీన్ ఎనర్జీని గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాగా మార్చాలని మేం కోరుకుంటున్నాం. గ్రీన్ డేటా సెంటర్ల ద్వారా AI ఆర్థిక వ్యవస్థకు విద్యుత్ అందించాలని కోరుకుంటున్నాం. చివరికి క్లీన్ ఎనర్జీకి సౌది అరేబియాగా ఏపీని తీర్చిదిద్దాలన్నదే మా అంతిమ లక్ష్యం. వివిధ రూపాల్లో స్వచ్ఛ ఇంధనాన్ని ప్రపంచానికి ఎగుమతి చేయగల రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలి. మనకు పునరుత్పాదక ఇంధన సామర్థ్యం ఉంది. సుదీర్ఘ సముద్ర తీరం ఉంది. ఓడరేవులు ఉన్నాయి. ఇండస్ట్రియల్ ల్యాండ్ ఉంది. మెరుగైన కనెక్టివిటీ ఉంది. నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉన్నాయి. ఈ ప్రయోజనాలన్నింటినీ ఒకచోటకు తీసుకురావడానికి అవసరమైన పాలసీ ఎన్విరాన్‌మెంట్ ను మేం సృష్టిస్తున్నాం. రాష్ట్ర స్థాయిలో 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ లక్ష్యాన్ని సాధించడంలో సుజ్లాన్ వంటి సంస్థలు కీలక పాత్ర పోషించనున్నాయి.

**రాష్ట్రవ్యాప్తంగా 22 క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం**

పూర్తిస్థాయి ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్ నిర్మాణంలో భాగంగా ఎనర్జీ, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్, కెమికల్స్, ఫిషరీస్, ఆక్వాకల్చర్, మ్యానుఫ్యాక్చరింగ్ వంటి అధిక వృద్ధి రంగాల్లో 22 పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు దిశగా ముందుకు వెళ్తున్నాం. క్లస్టర్లు ఎందుకంటే.. కంపెనీలు ఒంటరిగా పెట్టుబడులు పెట్టవు. అవి ఎకోసిస్టమ్ లో పెట్టుబడులు పెడతాయి. అందుకే మా విధానం చాలా సులభం. కేవలం ఒక కంపెనీని తీసుకురావడం కాదు.. ఆ కంపెనీ చుట్టూ పూర్తి ఎకోసిస్టమ్ ను నిర్మించాలి. ఒక కంపెనీ సప్లయర్స్ ను తీసుకొస్తుంది. సప్లయర్స్ మరిన్ని కంపెనీలను తీసుకొస్తారు. కంపెనీలు ఉద్యోగాలను సృష్టిస్తాయి. ఉద్యోగాలు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. దీంతో పెద్దఎత్తున పెట్టుబడులు తరలివస్తాయి.




**ఏపీ-సుజ్లాన్ భాగస్వామ్యంతో 12వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ**

ఈ భాగస్వామ్యంలో గర్వంగా అనిపించే మరో అంశం నైపుణ్యాభివృద్ధి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సుజ్లాన్ కలిసి 12వేల మంది యువతకు, అందులో 25 శాతం మహిళలకు ప్రాతినిధ్యం ఉండేలా గ్రీన్ ఎనర్జీ ఉద్యోగాల కోసం శిక్షణ అందిస్తున్నాయి. ఉరవకొండ, విజయవాడలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు పునరుత్పాదక ఇంధన రంగానికి అవసరమైన ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులను సిద్ధం చేస్తున్నాయి. రేపటి కంపెనీలు నైపుణ్యం ఉన్న ప్రాంతాలకే వస్తాయి. ఆ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ యువతలను సిద్ధంగా ఉండేలా చూడటం మన బాధ్యత. భారతదేశ స్వచ్ఛ ఇంధన భవిష్యత్తు కోసం శిక్షణ పొందుతున్న యువ ఇంజనీర్లు, సాంకేతిక నిపుణుల ద్వారా స్వర్గీయ తులసి తంతి గారి వారసత్వం మరోసారి కొనసాగుతోంది.

**అనంతపురం కొత్త కేరాఫ్ అడ్రస్ ఇదే..**

అనంతపురం జిల్లా అంటే కియా కార్లు, ఫైటర్ జెట్లు, సుజ్లాన్ రెన్యూవబుల్ ఎనర్జీ. ఒకప్పుడు అనంతపురం జిల్లా నుంచి యువత ఉపాధి, ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు, ఇతర జిల్లాలకు వెళ్లేవారు. ఇప్పుడు ఆ రోజులు పోయాయి. ఇతర ప్రాంతాల వాళ్లు ఉద్యోగాలు వెతుక్కుంటూ అనంతపురం జిల్లాకు వచ్చే రోజులు వచ్చాయి. ఇదంతా మన ఏపీ బ్రాండ్, విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు గారి వల్లే సాధ్యమైంది.

**20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం**

ఒక్క కియా పరిశ్రమ ఎన్ని కుటుంబాల్లో వెలుగు నింపిందో నేను పాదయాత్రలో స్వయంగా చూశాను. అప్పుడే 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలి అనే లక్ష్యంగా పెట్టుకున్నాను. ప్రపంచమంతా తిరిగి కంపెనీలను తీసుకువస్తున్నాం. మన గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు కూడా మన రాష్ట్రానికి కంపెనీలను తీసుకురావడానికి సహకరిస్తున్నారు. కంపెనీలను తీసుకురావడం మా బాధ్యత. ఆ అవకాశాలను అందిపుచ్చుకోవడం యువత బాధ్యత. మీ పని తీరుబట్టే మరిన్ని కంపెనీలు ఏపీకి వస్తాయి. అందుకే నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. పరిశ్రమలతో నేరుగా అనుసంధానం చేసి, యువతకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించాలని కోరుతున్నాం.

**మన భవిష్యత్ మనమే నిర్మించుకుందాం**

ప్రభుత్వం, పరిశ్రమలు, యువత కలిసి పనిచేసినప్పుడు ఎంత అద్భుత ఫలితాలు వస్తాయో మనం చూస్తున్నాం. పరిశ్రమలు పెట్టుబడులు, సాంకేతికతను తీసుకువస్తాయి. మన యువత ప్రతిభను, ఆశయాలను తీసుకువస్తారు. మనమంతా కలిసి అభివృద్ధిని సృష్టిస్తాం. ఏపీపై విశ్వాసం ఉంచిన గిరీష్ తంతి, అజయ్ కపూర్‌కు, మొత్తం సుజ్లాన్ బృందానికి ధన్యవాదాలు. ఈ రోజు మనం కేవలం పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూమిపూజ చేయడం లేదు. ఇంధనం, తయారీ, సాంకేతికత, ప్రతిభ ఆధారంగా నిర్మించబోయే కొత్త పారిశ్రామిక ఆంధ్రప్రదేశ్‌కు పునాది వేస్తున్నాం. ఈ రోజు ఇక్కడ ఉన్న ప్రతి పెట్టుబడిదారుడికి, పారిశ్రామికవేత్తలకు ప్రముఖుడికి నా సందేశం ఒక్కటే.. మా స్పీడ్, స్టెబిలిటీ, కమిట్ మెంట్, ఎగ్జిక్యూషన్ ను నమ్మండి. ఎందుకంటే మీరు ఏపీలో విజయవంతమైతే, ఏపీ కూడా మీతో కలిసి విజయవంతమవుతుంది. భవిష్యత్తు కోసం మనం ఎదురుచూడబోం. స్వచ్ఛ ఇంధనం, కొత్త పరిశ్రమలు, కొత్త ఉద్యోగాలు, కొత్త నైపుణ్యాలతో భవిష్యత్తును మనమే నిర్మించబోతున్నాం అని మంత్రి చెప్పారు.

# ఏపీ మున్సిపల్ శాఖ – యూకే ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పందం

- పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల అభివృద్ధికి గవర్నమెంట్ - గవర్నమెంట్ ఎంఓయూ
- అమరావతిని వరల్డ్ క్లాస్ స్మార్ట్, లివబుల్ సిటీగా అభివృద్ధి చేయడంలో యూకే నైపుణ్యం, సాంకేతిక సహకారం
- సస్టైనబుల్ అర్బన్ డెవలప్‌మెంట్, ఆధునిక టెక్నాలజీ, ఇంటిగ్రేటెడ్ అర్బన్ మొబిలిటీపై కలిసి పనిచేయనున్న ఏపీ–యూకే
- మునిసిపాలిటీల్లో రూ.40 వేల కోట్ల మౌలిక వసతుల పనులకు ప్రపంచస్థాయి సాంకేతికత వినియోగం
- మీడియాతో మంత్రి నారాయణ.

**అమరావతి ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధిని అంతర్జాతీయ నైపుణ్యం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సుస్థిర మౌలిక వసతులతో మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగాల్లో దీర్ఘకాలిక సహకారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-యునైటెడ్ కింగ్డమ్ ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం (MoU) మంగళవారం అమరావతిలో కుదిరింది.వెలగపూడిలోని సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్,యూకే ప్రభుత్వ డిపార్ట్ మెంట్ ఫర్ బిజినెస్ అండ్ ట్రేడ్ గవర్నమెంట్ పార్ట్‌నర్‌షిప్స్ డిప్యూటీ డైరెక్టర్ చాజ్ వాలియా ఒప్పందంపై సంతకాలు చేశారు. పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ నాయకత్వంలో ఏపీ ప్రతినిధి బృందం, యూకే ప్రతినిధి బృందం కార్యక్రమంలో పాల్గొన్నాయి.

**అమరావతితో పాటు రాష్ట్ర పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం**

ఈ భాగస్వామ్యంలో అమరావతి కీలక సహకార రంగంగా నిలవనుంది. ఆధునిక, సుస్థిర, పర్యావరణహిత, మెరుగైన కనెక్టివిటీతో ప్రపంచ ప్రమాణాలకు అనుగుణమైన రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి యూకే నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం మరింత బలం చేకూర్చనుంది.అమరావతితో పాటు రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా ఈ సహకారం ఉపయోగపడనుంది. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర ప్రాథమిక మౌలిక వసతులను మరింత సమర్థవంతంగా అభివృద్ధి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోంది.రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దాదాపు రూ.40 వేల కోట్ల విలువైన మౌలిక వసతుల పనులను టేకప్ చేసి, అనేక పనులకు టెండర్లు పిలిచి అమలు చేస్తున్నామని మంత్రి శ్రీ పి. నారాయణ తెలిపారు. ఈ పనుల్లో యూకేకు చెందిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉత్తమ విధానాలను వినియోగించడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందన్నారు.

**నాలుగు ప్రధాన రంగాల్లో సహకారం**

ఆంధ్రప్రదేశ్-యూకే భాగస్వామ్యం ప్రధానంగా మౌలిక వసతుల ప్రణాళిక, సుస్థిర పట్టణాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ-ఆవిష్కరణలు, సమగ్ర పట్టణ రవాణా వ్యవస్థలపై కొనసాగనుంది.

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రాజెక్టుల ప్రణాళిక, ప్రాధాన్యత క్రమం, ఆర్థిక సాధ్యాసాధ్యాల అంచనా, పెట్టుబడులకు అనుకూలమైన బిజినెస్ కేసుల రూపకల్పన, ప్రాజెక్ట్ డిజైన్, ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్, అమలు వంటి అంశాల్లో ఇరు ప్రభుత్వాలు కలిసి పనిచేయనున్నాయి.

రాష్ట్రంలోని నగరాలను మెరుగైన అర్బన్ స్ట్రక్చర్‌తో స్మార్ట్, లివబుల్ సిటీలుగా తీర్చిదిద్దేందుకు యూకే నైపుణ్యాన్ని వినియోగించుకోనున్నారు. సుస్థిర పట్టణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఆధునిక పట్టణ ప్రణాళిక, సమర్థవంతమైన మౌలిక వసతుల రూపకల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**అమరావతి అభివృద్ధిలో యూకే నైపుణ్యం**

అమరావతి అభివృద్ధిలో యూకే సంస్థలతో ఇప్పటికే ఏర్పడిన అనుసంధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. లండన్‌కు చెందిన ఫోస్టర్ + పార్ట్‌నర్స్ సంస్థ అమరావతి ప్రభుత్వ సముదాయంలోని అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాల రూపకల్పనలో భాగస్వామ్యం కావడం ఇరు పక్షాల మధ్య ఉన్న సహకారానికి ఉదాహరణగా నిలుస్తోంది. అమరావతి తదుపరి దశ అభివృద్ధిలో పట్టణ ప్రణాళిక, సుస్థిర మౌలిక వసతులు, పట్టణ రవాణా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రాజెక్టుల రూపకల్పన, అమలు తదితర రంగాల్లో యూకే నైపుణ్యాన్ని మరింతగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలించనున్నారు. అమరావతి రివర్‌ఫ్రంట్, పట్టణ పునరుద్ధరణ, మిశ్రమ వినియోగ అభివృద్ధి వంటి రంగాల్లోనూ అంతర్జాతీయ అనుభవాన్ని వినియోగించుకునే అవకాశాలు ఉన్నాయి.

**ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం**

సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, ఆవిష్కరణలకు ఈ ఒప్పందంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్ (ITS), బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ (BIM), డిజిటల్ ట్విన్స్, ఆధునిక నిర్మాణ సాంకేతికతలు, పరిశోధన-అభివృద్ధి (R&D) వంటి రంగాల్లో సహకారం అందించనున్నారు.యూకేలోని వివిధ సంస్థల అత్యుత్తమ నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా ప్రభుత్వ సంస్థల సామర్థ్యాన్ని పెంచడం, నిపుణుల మధ్య జ్ఞాన మార్పిడిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. పట్టణ రవాణా వ్యవస్థలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ఏపీ-యూకే కలిసి పనిచేయనున్నాయి. మెట్రో రైలు, బస్సు వ్యవస్థలు, విమానాశ్రయాల అనుసంధానం, పాదచారుల మౌలిక వసతులు, డేటా ఆధారిత రవాణా ప్రణాళిక వంటి అంశాలపై సహకారం కొనసాగనుంది.

దీని ద్వారా పట్టణాల్లో కనెక్టివిటీ మెరుగుపరచడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, కాలుష్యాన్ని నియంత్రించడం, ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

**పెట్టుబడుల సమీకరణకు అవకాశాలు**

మౌలిక వసతుల ప్రాజెక్టులకు కొత్త ఆర్థిక నమూనాలు, పెట్టుబడుల సమీకరణ అవకాశాలను కూడా ఈ ఒప్పందం కల్పిస్తుంది. అర్హత కలిగిన ప్రాజెక్టులకు నిర్దేశిత ఆర్థిక అర్హతలు, డ్యూ డిలిజెన్స్, యూకే కంటెంట్ తదితర నిబంధనలకు లోబడి యూకే ఎక్స్‌పోర్ట్ ఫైనాన్స్ (UKEF) ద్వారా ఆర్థిక సహాయం పొందే అవకాశాలను పరిశీలించవచ్చు.ఈ సందర్భంగా పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.



నారాయణ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, యూకే డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ అండ్ ట్రేడ్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు.అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మరింత మెరుగ్గా అభివృద్ధి చేయడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నగరాలను లివబుల్ సిటీలుగా, స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేయడానికి యూకే సహకారం అందించనుందని తెలిపారు.బెస్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్, సస్టైనబుల్ సిటీస్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్మేషన్, ఇంటిగ్రేటెడ్ అర్బన్ మొబిలిటీ వంటి రంగాల్లో ప్రత్యేకంగా సహకారం అందనుందని చెప్పారు. యూకేలోని వివిధ కంపెనీల బెస్ట్ ఎక్స్‌పర్టైజ్‌ను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం, ప్రపంచస్థాయి టెక్నాలజీ, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను రాష్ట్రంలో అమలు చేయడం ఈ భాగస్వామ్యం ద్వారా సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు.లండన్‌కు చెందిన నార్మన్ ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ అమరావతి ఐకానిక్ టవర్స్, అసెంబ్లీ, హైకోర్టు డిజైన్‌లో భాగస్వామ్యం కావడం ఇప్పటికే ఉన్న సహకారానికి నిదర్శనమన్నారు. యూకేలో ఉన్న అత్యుత్తమ నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకునేందుకు ఈ ఒప్పందం మరింత అవకాశాలను కల్పిస్తుందని చెప్పారు.ఆంధ్రప్రదేశ్‌కు అవసరమైన సాంకేతిక సహకారం అందించేందుకు యూకే ప్రతినిధులు ముందుకు వచ్చారని, యూకే డిప్యూటీ హై కమిషనర్, బిజినెస్ విభాగం డైరెక్టర్ జనరల్ సహా ప్రతినిధులు అమరావతికి వచ్చి రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకే యూకే ప్రభుత్వంతో చర్చలు జరిపి ఈ అవగాహన ఒప్పందం చేసుకున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచంలోని టాప్ ఫైవ్ సిటీల్లో ఒకటిగా అమరావతిని అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి లక్ష్యంలో భాగంగా ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానం, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను అమరావతి అభివృద్ధిలో వినియోగించుకోవడమే లక్ష్యమన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి ప్రాథమిక మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి తెలిపారు. రోడ్లు, డ్రైన్లు, వాటర్ సప్లై, సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ తదితర రంగాల్లో పెద్ద ఎత్తున పనులు చేపట్టామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.40 వేల కోట్ల విలువైన పనులను చేపట్టామని, యూకే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటే ఈ పనులను మరింత మెరుగైన ప్రమాణాలతో పూర్తి చేసే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు.ఈ కార్యక్రమంలో ఏపీసీఆర్డీఏ కమిషనర్ శ్రీ విజయ రామరాజు, ఐఏఎస్; ఏపీసీఆర్డీఏ అదనపు కమిషనర్ రాహుల్, సీడీఎంఏ, ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యూకే ప్రతినిధి బృందంలో దక్షిణాసియా ట్రేడ్ కౌన్సిలర్ మార్క్ బిర్రెల్, డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, నేషనల్ లీడ్-ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రిషికేష్ చందా, సౌత్ ఇండియా రీజినల్ హెడ్-ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రోహిత్ చంద్రగిరి, గవర్నమెంట్ పార్ట్‌నర్‌షిప్స్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ చాజ్ వాలియా పాల్గొన్నారు.

# నాలెడ్జ్ హబ్‌గా అమరావతిని తీర్చిదిద్దుతాం

- డిసెంబర్ చివరికి క్వాంటం కంప్యూటింగ్ భవనం పూర్తి
- జనవరిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు ప్రారంభించే దిశగా చర్యలు
- అమరావతి పర్యటన తర్వాత మీడియాతో మంత్రి పొంగూరు నారాయణ

**అమరావతి ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్**

అమరావతి రాజధానిని నాలెడ్జ్ హబ్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేసిన తరహాలో అమరావతిని క్వాంటం కంప్యూటింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అమరావతిలో నిర్మిస్తున్న క్వాంటం కంప్యూటింగ్ భవన నిర్మాణ పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.క్వాంటం వ్యాలీ మిషన్‌లో భాగంగా సుమారు 45,216 చదరపు అడుగుల విస్తీర్ణంలో క్వాంటం కంప్యూటింగ్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. భవన నిర్మాణంలో ప్రధాన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు.క్వాంటం ల్యాబ్ కోసం ప్రత్యేకమైన నిర్మాణ సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి తెలిపారు. 'రూమ్ వితిన్ రూమ్' కాన్సెప్ట్‌తో ల్యాబ్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు. భూమి నుంచి వచ్చే సీస్మిక్ వైబ్రేషన్స్, పరిసర ప్రాంతాల నుంచి వచ్చే ట్రాఫిక్ తదితర శబ్దాలు క్వాంటం కంప్యూటింగ్ పరికరాల పనితీరుపై ప్రభావం



చూపకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం జర్మన్ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు వెల్లడించారు.క్వాంటం చిప్‌లను అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలకు చల్లబరచేందుకు హీలియం కంప్రెసర్లు, క్రయోజెనిక్ డైల్యూషన్ రిఫ్రిజిరేటర్ వంటి అధునాతన వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు.క్వాంటం కంప్యూటింగ్ వ్యవస్థకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా డ్యూయల్ యాక్టివ్ ఫీడర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఒక ఫీడర్‌లో అంతరాయం ఏర్పడినా మరో ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా కొనసాగించేలా ఈ వ్యవస్థను రూపొందిస్తున్నట్లు తెలిపారు.గ్రిడ్ నుంచి వచ్చే హార్మోనిక్ డిస్టర్బెన్స్‌లను నియంత్రించేందుకు K13 రేటెడ్ ఐసోలేషన్ ట్రాన్స్‌ఫార్మర్లు వినియోగిస్తున్నామని చెప్పారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించే లక్ష్యంతో గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌ను కూడా అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు.

**డిసెంబర్ చివరి నాటికి పూర్తి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన దిశానిర్దేశం మేరకు డిసెంబర్ చివరి నాటికి క్వాంటం కంప్యూటింగ్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ప్రస్తుతం ప్రధాన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, త్వరలో ఎంఈపీ (మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్) పనులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. సెప్టెంబర్ 15 నాటికి ఎల్అండ్‌టీ సంస్థ ఎంఈపీ పనుల కోసం భవనాన్ని అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.డిసెంబర్ చివరి నాటికి భవనాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, క్వాంటం కంప్యూటింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసే ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. అనంతరం జనవరిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలను ప్రారంభించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు.

## క్వాంటం వ్యాలీలో రెండు భారీ టవర్లు

**క్వాంటం కంప్యూటింగ్ భవనం పక్కనే రెండు భారీ టవర్లను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని మంత్రి తెలిపారు. ఒక్కో టవర్ 48 అంతస్తులతో,202 మీటర్ల ఎత్తు ఉండేలా డిజైన్ చేసినట్లు చెప్పారు. రెండు టవర్లకు కలిపి సుమారు 37 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి రానుందని తెలిపారు.ఈ టవర్ల నిర్మాణానికి టెండర్లు పిలిచామని, ఎల్-1 కూడా ఖరారైనట్లు మంత్రి వెల్లడించారు.హైదరాబాద్‌లో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసే క్రమంలో సైబర్ టవర్స్ ద్వారా వివిధ కంపెనీలు, సంస్థలకు స్థలాన్ని అందించిన విధంగానే అమరావతిలోని క్వాంటం వ్యాలీ టవర్లలోనూ స్టార్టప్‌లు, టెక్నాలజీ సంస్థలు, వివిధ కంపెనీలను ఆకర్షించి వారికి అవసరమైన స్పేస్ అందించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ సైబర్ టవర్స్ తరహాలోనే కాకుండా, అంతకంటే మెరుగైన స్థాయిలో క్వాంటం వ్యాలీ టవర్లను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి నారాయణ తెలిపారు.క్వాంటం కంప్యూటింగ్ రంగంలో దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ సంస్థలను అమరావతికి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ క్వాంటం వ్యాలీ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించి వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. అమరావతిని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు, క్వాంటం కంప్యూటింగ్ రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే ముందంజలో నిలపడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.జనవరిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.**

# ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా రేపటి రామాంజనేయులు ఏకగ్రీవ ఎన్నిక

**అనంతపురం, ఆగస్టు 25:అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా ఐ న్యూస్ బ్యూరో సీనియర్ జర్నలిస్టు రేపటి రామాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతపురం మెడికల్ కళాశాల సమీపంలోని ఐఎంఏ హాల్లో మంగళవారం ఏపీడబ్ల్యూజేఎఫ్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏపీబీజేఏ) జిల్లా కమిటీల ఎన్నికలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రాయలసీమ ఇన్‌చార్జి జయరాజ్, ఎన్నికల పరిశీలకుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు.అంతకుముందు వందలాది మంది జర్నలిస్టులు నగరంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి, తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐఎంఏ హాల్‌కు చేరుకుని ఎన్నికల్లో పాల్గొన్నారు.ఎన్నికల అధికారిగా సీనియర్ జర్నలిస్టు తలారి రామాంజనేయులు, సహాయ ఎన్నికల అధికారిగా ప్రతిమ వ్యవహరించారు. నామినేషన్ల ప్రక్రియ అనంతరం జర్నలిస్టులంతా ఏకతాటిపైకి వచ్చి ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏ జిల్లా కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా రేపటి రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా టీ. శివప్రకాశ్ (ప్రజాశక్తి), కోశాధికారిగా సుదర్శన్‌రెడ్డి (ఎన్ టీవీ) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వెంకటేశులు (అనంత జనశక్తి), వై. కన్న (వార్త), పి. హరిప్రసాద్ (అనంత పోరు) ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా కే. రవీంద్రనాథ్ (ఐ న్యూస్), కే. సతీష్‌బాబు (వార్త), ఎస్. గోవింద్‌రెడ్డి (నేటి వార్త), ప్రచార కార్యదర్శిగా కె. అమర్ బ్రహ్మాచారి ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా బి. షేర్ఖాన్, కే. భాస్కర్, డి. తిమ్మప్ప, వై. కుల్లాయప్ప, కే.సి. తిమ్మప్ప, జి. రామాంజనరెడ్డి, ఎన్. అస్లం బాషా, కే. శరత్‌కుమార్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా తలారి రామాంజనేయులు కొనసాగనున్నారు.అదేవిధంగా ఏపీబీజేఏ జిల్లా అధ్యక్షుడిగా బి. మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.కే. సూర్య ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ నూతన జిల్లా అధ్యక్షుడు రేపటి రామాంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీతో కలిసి నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. జర్నలిస్టులకు పింఛన్ విధానాన్ని అమలు చేయడంతో పాటు ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.జర్నలిస్టుల సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పుడు సానుభూతి మాత్రమే కాకుండా సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరారు. నిజాయితీగా వార్తలు రాసే జర్నలిస్టులకు భద్రత కల్పించేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం అవిశ్రాంతంగా పోరాడుతామని స్పష్టం చేశారు.రేపటి రామాంజనేయులు ఏకగ్రీవ ఎన్నికపై జిల్లా జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.



# పెండింగ్ భూసేకరణ, ఆర్అండ్ఆర్ సమస్యలు వేగంగా పరిష్కరించాలి



- సాగునీటి ప్రాజెక్టుల పూర్తి లక్ష్యంగా చర్యలు
- అర్హులైన రైతులు, నిర్వాసితులకు సకాలంలో పరిహారం

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్

హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పునరావాసం, పునరావాస పునరుద్ధరణ (ఆర్అండ్ఆర్), అటవీ సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రాజెక్టుల వారీగా భూసేకరణ, ఆర్అండ్ఆర్ చెల్లింపులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ అవార్డులు, టోకెన్లను త్వరగా క్లియర్ చేసి, పీడీ ఖాతాల్లో ఉన్న నిధులను అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందించాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, ఆర్అండ్ఆర్ సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు. రైతులు, నిర్వాసితులకు నిబంధనల ప్రకారం న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రాజెక్టుల పనులకు ఎలాంటి అవరోధాలు లేకుండా చూడాలని ఆదేశించారు.

# ప్రభుత్వ ఐటిఐ/ ఏటీసీ లో వాకిన్ అడ్మిషన్స్

మణుగూరు, ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్




ప్రభుత్వ ఐటిఐ/ ఏ టి సి లో ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు వాకిన్ అడ్మిషన్లుకు ఆన్లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ ఓ సారంగపాణి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లోని ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డిజిల్ ట్రేడ్లలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ప్రవేశాలు కోరుతున్నట్లు తెలిపారు. అదేవిదంగా ఏటీసీ లోని అన్ని ట్రేడ్లలో ప్రవేశలాలు కోరుతున్నామన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వాళ్లు నేరుగా కాలేజీకి వచ్చి ప్రవేశం పొందవచ్చు అన్నారు. దరఖాస్తు చేసుకొని వారు సైతం తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కాలేజీకి వచ్చి ఆన్లైన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 5 వరకు కాలేజీ కి వచ్చి వాకిన్ లో నేరుగా ప్రవేశం పొందాలని తెలిపారు. ఉదయం 11గంటల లోపు కాలేజీ కి వచ్చి ప్రవేశం పొందాలన్నారు. ఈ అవకాశాన్ని పినపాక నియోజకవర్గం పరిధిలోని విద్యార్థిని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకొని తమకు నచ్చిన ట్రేడ్లలో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. అడ్మిషన్ల కోసం https://iti.telangana.gov.in లో దరఖాస్తు చేసుకొని నేరుగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో కాలేజీకి వచ్చి నచ్చిన ట్రేడ్లో ప్రవేశం పొందవచ్చునని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి: సీఐ నాగబాబు



- సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన
- క్రమశిక్షణతో లక్ష్యాల వైపు సాగాలి

మణుగూరు, ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్ :

సిద్దార్థ ఒకేషనల్ జూనియర్ కళాశాల మణుగూరులో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్, సైబర్ మోసాలు, క్రమశిక్షణ, భవిష్యత్తు ప్రణాళికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వల్లభనేని అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మణుగూరు పట్టణ సీఐ పాటి నాగబాబు, ఎస్ఐ రావూఫ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ పాటి నాగబాబు మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. అలాగే ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, సోషల్ మీడియా ద్వారా జరిగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఐ రావూఫ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ తమ లక్ష్యాలను ముందుగానే నిర్దేశించుకుని, ఉన్నత భవిష్యత్తు కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు లేదా సైబర్ మోసాలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో డ్రగ్స్ నివారణ, సైబర్ భద్రత, క్రమశిక్షణ, భవిష్యత్తుపై బాధ్యతాయుతమైన ఆలోచన పెంపొందించేందుకు కృషి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వల్లభనేని అజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలీసు ఉద్యోగార్థులకు ఉచిత సెమీ రెసిడెన్షియల్ కోచింగ్

- 7,437 పోలీసు ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- యువత ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి: ఎస్పీ రోహిత్ రాజు

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్ :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలోని సివిల్, ఏఆర్, టీజీఎస్పీ విభాగాలతో పాటు ఎస్పీఎఫ్, జైళ్ల శాఖ, ఫైర్ విభాగాల్లో సుమారు 7,437 ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నిరుద్యోగ యువతకు పోలీసు ఉద్యోగాల సాధనలో తోడ్పడేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత సెమీ రెసిడెన్షియల్ కోచింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ తెలిపారు. జిల్లాలోని పేద, గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులకు నాణ్యమైన శిక్షణ అందించి పోలీసు ఉద్యోగాలకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే రాత పరీక్షలకు సంబంధించిన శిక్షణతో పాటు, పోలీసు అధికారుల పర్యవేక్షణలో ఫిజికల్ ట్రైనింగ్‌ను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పించనున్నట్లు చెప్పారు.

పోలీసు శాఖలో చేరాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు 26082026 నుంచి 31082026 వరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో అందుబాటులో ఉన్న దరఖాస్తు ఫారాన్ని పూర్తి




వివరాలతో నింపి, విద్యార్హతలకు సంబంధించిన స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను జతచేసి సమర్పించాలని సూచించారు. మహిళా అభ్యర్థులు కూడా ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, అర్హులైన, ప్రతిభావంతులైన అభ్యర్థులను పారదర్శకంగా ఎంపిక చేసేందుకు 06092026న కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లందు, భద్రాచలం, మణుగూరు పట్టణాల్లో ప్రత్యేక స్క్రీనింగ్ టెస్ట్ (అర్హత పరీక్ష) నిర్వహించనున్నట్లు తెలిపారు. స్క్రీనింగ్ టెసట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు కోచింగ్ ప్రారంభ తేదీ, శిక్షణా కేంద్రం, ఇతర పూర్తి వివరాలను అధికారికంగా మీడియా ద్వారా ప్రకటిస్తామని వెల్లడించారు.

మరిన్ని వివరాల కోసం ఎస్‌బీII ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను 8712682013 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగాన్ని లక్ష్యంగా పెట్టుకున్న యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రమశిక్షణతో కృషి చేసి తెలంగాణ పోలీసు శాఖలో ఉద్యోగం సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా పోలీసు శాఖ అందిస్తున్న ఉచిత కోచింగ్‌ను ప్రతి అభ్యర్థి వినియోగించుకోవాలని సూచించారు.

# రేగా కాంతారావు ఆరోపణలను ఖండించిన కాంగ్రెస్ నేతలు

- రాజకీయ ఉనికి కోసమే నిరాధార ఆరోపణలు: కాంగ్రెస్
- ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విమర్శలు సరికాదు
- భూముల అంశాలపై సమాధానం చెప్పాలి: కాంగ్రెస్ నేతలు
- వచ్చే ఎన్నికల్లో పాయం వెంకటేశ్వర్లు విజయం ఖాయం

మణుగూరు, ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్ :



మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఎమ్మెల్యే, మంత్రులు, ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే రేగా కాంతారావు కాంగ్రెస్ పార్టీపై, ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

ప్రజలకు దూరంగా సుమారు 25 రోజుల పాటు ఉండి ఇప్పుడు రాజకీయ విమర్శలు చేయడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అవకాశాల వల్లే రేగా కాంతారావు రెండుసార్లు రాజకీయంగా ఎదిగారని పేర్కొన్నారు.

ఒక మహిళకు సంబంధించిన కేసులో సాక్ష్యాధారాలు లభించకపోవడంతో కేసు కొట్టివేయబడిన విషయాన్ని ప్రస్తావిస్తూ, క్వాష్ పిటిషన్ కొట్టివేయబడినంత మాత్రాన తాను నిజాయితీపరుడినని చెప్పుకోవడం సమంజసం కాదన్నారు. అధికారులను అడ్డుపెట్టుకుని రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై గతంలో చేసిన వ్యాఖ్యలను వారు తప్పుబట్టారు. ఒక మహిళను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే రేగా కాంతారావు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. దళిత బంధు, లక్ష రూపాయల రుణాలను ఇప్పించి కమీషన్ల కోసం ప్రజలను వేధించలేదా అని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలపై రాజకీయ ర్యాలీలు నిర్వహించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. సమస్యలుంటే హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమాలు నిర్వహించకుండా మణుగూరులో ఎందుకు ర్యాలీలు చేస్తున్నారని నిలదీశారు.

మణుగూరులో భూములకు సంబంధించిన అంశాలపై కూడా కాంగ్రెస్ నాయకులు పలు ప్రశ్నలు సంధించారు. ట్రస్టులు, దేవాలయాలను అడ్డుపెట్టుకుని భూముల ఆక్రమణలకు పాల్పడింది ఎవరో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఆక్రమిత భూములకు రైతుబంధు ప్రయోజనాలు కూడా పొందుతున్నారనే ఆరోపణలపై సమాధానం చెప్పాలని అన్నారు.

వచ్చే ఎన్నికల్లో మళ్లీ పాయం వెంకటేశ్వర్లు విజయం సాధించడం ఖాయమని కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. తమ పార్టీపై నిరాధార ఆరోపణలు చేసి పార్టీ నేతల వద్ద పేరు తెచ్చుకోవాలని ప్రయత్నించడం సరైంది కాదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆనాడు సంతకం చేయని వ్యక్తికి తెలంగాణ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని విమర్శించారు.


రేగా కాంతారావు నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని, ఎమ్మెల్యే, మంత్రులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు శివ సైదులు, బనోత్ లక్ష్మణ్, రామ్ రెడ్డి, మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, రాష్ట్ర నాయకులు సామ శ్రీనివాసరెడ్డి, సర్పంచులు కలబోయిన మాధవరావు, పూణేం రమేష్, పాల్వంచ రాములు, ఎనిక శ్వేత, ఉప సర్పంచులు గాండ్ల సురేష్, గోరంట్ల కనకయ్య, వార్డు సభ్యులు కొలపిన్ని మానస, కృష్ణవేణి, జిల్లా ముఖ్య నాయకులు ఆవుల సర్వేశ్వరరావు, కూచిపూడి బాబు, గణేష్‌రెడ్డి, మహిళా నాయకులు వరలక్ష్మి, మధుబాబు, కటుకూరి శ్రీను, గుమాస్తాల సంఘం నాయకులు తాతా ప్రసాద్, శ్రీను, 12 టైర్ యూనియన్ నాయకులు సురేందర్ రెడ్డి, ముఖ్య నాయకులు బత్తుల శ్రీను, వాసంశెట్టి వెంకట్రావు, మండల ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రేగా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

- సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు
- -"తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు..
- మహిళను అడ్డుపెట్టుకుని రాజకీయం చేసే అవసరం మాకు లేదు

గుండాల మండల కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక



గుండాల, ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుపై మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఇకపై తమ నాయకులపై నోరు జారితే సహించేది లేదని గుండాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. సోమవారం రేగా కాంతారావు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గుండాల మండల కాంగ్రెస్ నాయకులు ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పొంబోయిన ముత్తయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్కే ఖదీర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదన్నారు. రేగా కాంతారావుకు సంబంధించిన వ్యక్తిగత కేసులతో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తమ పార్టీని, నాయకులను బద్నాం చేసేందుకు ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కు అందరికీ ఉన్నప్పటికీ.. వ్యక్తిగత ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలతో రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తోందని తెలిపారు. రేగా కాంతారావు తనపై నమోదైన కేసు విషయంలో బహిరంగంగా మాట్లాడుతున్నారని, అయితే కేసు విచారణకు సంబంధించిన అంశాలను రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం తగదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కేసులో వాస్తవాలు ఏంటో దర్యాప్తు, న్యాయస్థానాల ద్వారా తేలుతాయని పేర్కొన్నారు.

**మహిళా ఫిర్యాదుదారుకు రక్షణ కల్పించాలి**

ఈ సందర్భంగా కాంగ్రెస్ మహిళా నాయకులు మాట్లాడుతూ.. ఒక మహిళ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో, ఆమెపై ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఫిర్యాదుదారుపై ఎలాంటి ఒత్తిడి, బెదిరింపులు లేదా ప్రతీకార చర్యలు జరగకుండా అధికారులు తగిన రక్షణ కల్పించాలని కోరారు. కేసు విషయంలో నిష్పాక్షికంగా, సమగ్రంగా దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

**పాయం అభివృద్ధికి కృషి చేస్తున్నారు**

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నిరంతరం ప్రజల్లో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. నియోజకవర్గానికి వివిధ అభివృద్ధి పనులకు నిధులు తీసుకువస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్న నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ప్రజల్లో విద్వేషాలు పెంచే రాజకీయాలు కాకుండా.. ప్రజల మధ్య ఐక్యత, ప్రేమ, ఆప్యాయతలు పెంచే రాజకీయాలకు నాయకులు ప్రాధాన్యత ఇవ్వాలని వారు సూచించారు. గౌరవప్రదమైన హోదాలో ఉన్నవారు బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు.

**అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

గుండాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఊకే బుచ్చయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలే రాజకీయ నాయకుల పనితీరుకు తగిన తీర్పు ఇస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సాయనపల్లి సర్పంచ్ కల్తి కృష్ణవేణి, పడుగోనిగూడెం సర్పంచ్ ఈసం సంజీవరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుర్రం పుష్పరాజ్, మాజీ ఎంపీపీ చాట్ల పద్మ, మండల నాయకులు ఎస్కే అబ్దుల్ నబీ, వాంకుడోత్ బీకజీ, ఈసం రాజబాబు, భూక్య శ్రీను, ఎస్కే కాసీం, ఎస్కే వాజీద్ పాషా, బోడ వెంకన్న, ఉపసర్పంచ్ వట్టం కృష్ణారావు, వంకుడోత్ రమేష్, పూనెం సావిత్రి, తిర్రి సుగుణ, ఎస్కే ఇస్రార్, బొంగు చంద్రశేఖర్, సనప రాంబాబు, నూనావత్ రవి, పాయం గణేష్, సూర్నబాక కిషన్, వజ్జ ప్రభాకర్, ఇస్లావత్ మోహన్, బానోత్ నరేందర్, బానోత్ నరేష్, గద్దం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్



వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. ఇల్లందు క్రాస్‌రోడ్‌లోని చలమల శ్రీనివాసరావు మెమోరియల్ సెంట్రల్ పార్క్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి వన మహోత్సవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, అవి మనుగడ సాగించేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం, రక్షణ కల్పించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.

పాఠశాల విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. విద్యార్థులు తమ ఇళ్ల వద్ద, పాఠశాల ఆవరణల్లో, పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, అది వృక్షంగా ఎదిగే వరకు సంరక్షిస్తే పర్యావరణ పరిరక్షణలో ఎంతో కీలకమైన మార్పు తీసుకురాగలమన్నారు. ప్రస్తుత తరంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు పచ్చదనం ఎంతో అవసరమని తెలిపారు. జిల్లాలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు సమష్టిగా కృషి చేసి వన మహోత్సవ లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరి భాగస్వామ్యంతోనే డ్రగ్స్ ను సమర్థంగా కట్టడి చేయగలం

- నషా ముక్త్ భారత్ అభియాన్‌పై 'వార్త' మీడియా వర్క్‌షాప్ ను ప్రారంభించిన
- మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణ రెడ్డి
- ఈగల్ ఫోర్స్ పోలీస్ సూపరింటెండెంట్ రావుల గిరిధర్ (ఐపీఎస్)
- పీఐబీ- హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్

మహేశ్వరం, ఆగస్టు 25, ( అనంత జన శక్తి )



ప్రజలందరి భాగస్వామ్యంతోనే డ్రగ్స్ ను సమర్థంగా కట్టడి చేయగలం అని మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణ రెడ్డి అన్నారు. పత్రికా సమాచార కార్యాలయం హైదరాబాద్ ఆధ్వర్యంలో మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్యంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ)' కార్యక్రమంపై రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో మీడియా ప్రతినిధులకు 'వార్త' మీడియా వర్క్‌షాప్‌ను ఈ రోజు నిర్వహించారు.
మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణ రెడ్డి (ఐపీఎస్) ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈగల్ ఫోర్స్ పోలీస్ సూపరింటెండెంట్ శ్రీ రావుల గిరిధర్ (ఐపీఎస్), పీఐబీ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, మహేశ్వరం ఎంపీడీవో శ్రీమతి ఎన్. శారదమ్మ ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.మహేశ్వరం జోన్ డీసీపీ శ్రీ కె. నారాయణ రెడ్డి (ఐపీఎస్) మాట్లాడుతూ.. ''డ్రగ్స్ భూతాన్ని ఎదుర్కొనేందుకు చట్టపరమైన ఆంక్షలు మాత్రమే సరిపోవు.. ప్రజలందరి భాగస్వామ్యంతోనే దాన్ని సమర్థంగా కట్టడి చేయగలం'' అన్నారు. మాదకద్రవ్యాల సరఫరా, సంబంధిత కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా.. ఎస్ఐడీ, ఆక్టోపస్, సీఐఎస్ఎల్, ఈగల్ ఫోర్సుల వంటి బలమైన ప్రత్యేక బలగాలతోపాటు స్థానిక పోలీసు యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందన్నారు.
మాదకద్రవ్య నివారణ చర్యలు ఇళ్లలోనే, బడుల్లోనే మొదలుకావాలన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, సహచరులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సకాలంలో సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా డ్రగ్స్ ముప్పును సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా యువతను కాపాడుకోవడాన్ని శాంతిభద్రతల అంశంగా మాత్రమే చూడలేమన్నారు. వారి ఆరోగ్యాన్నీ, నైపుణ్యాన్నీ, సామర్థ్యాన్నీ పెంపొందించడంలోనూ ఇది అత్యావశ్యకమన్నారు. మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాలు..నేడు దేశవ్యాప్త ప్రజా ఉద్యమంగా మారాయని శ్రీ కె. నారాయణ రెడ్డి వ్యాఖ్యానించారు. మాదకద్రవ్య రహిత భారత్ నిర్మాణం దిశగా ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ధ్రువీకృత సమాచారాన్ని ప్రసారం చేయాలనీ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను చెప్పాలనీ, డ్రగ్స్ బారిన పడకుండా యువతను ముందస్తుగానే జాగరూకులను చేయాలనీ, కౌన్సెలింగ్ పునరావాస సేవలపై ప్రజలకు తగిన సమాచారాన్ని అందించాలనీ మీడియా సిబ్బందిని ఆయన కోరారు.మాదకద్రవ్యాలను అరికట్టే దిశగా సమన్వితం చర్యలను వివరించిన ఈగల్ ఫోర్స్ ఎస్పీ
'నషా ముక్త్ భారత్ అభియాన్'పై అవగాహన సదస్సులో తెలంగాణ ఈగల్ ఫోర్స్ పోలీసు సూపరింటెండెంట్ శ్రీ రావుల గిరిధర్ (ఐపీఎస్) మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత, కుటుంబ సమస్య స్థాయిని దాటి.. నేడు తీవ్రమైన సామాజిక, శాంతిభద్రతల, జాతీయ భద్రతా సవాలుగా పరిణమించిందన్నారు. ఈ ముప్పును ఎదుర్కొనే దిశగా సంబంధిత భాగస్వామ్య పక్షాలన్నీ సమన్వయంతో కృషి చేయాలన్నారు.జనవరి నుంచి తెలంగాణలో దాదాపు 8 వేల కేజీల గంజాయిని ఈగల్ ఫోర్స్ సీజ్ చేసిందని ఆయన తెలిపారు. దాదాపు 22 రకాల శిక్షణ కార్యక్రమాల ద్వారా 30 వేల మందికి పైగా పోలీసు సిబ్బందికీ, ఇతర శాఖల అధికారులకూ శిక్షణ ఇచ్చినట్టు పేర్కొన్నారు.ఈ సమన్విత చర్యల్లో మీడియా సిబ్బంది పాత్ర అత్యంత కీలకమైనదని శ్రీ రావుల గిరిధర్ అన్నారు. బాధ్యతాయుతమైన, సున్నితత్వంతో కూడిన రిపోర్టింగ్ ద్వారా.. యువతలో అవగాహనను పెంపొందించవచ్చనీ, తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చనీ, పునరావాస చర్యలను ప్రోత్సహించవచ్చనీ పేర్కొన్నారు.
మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసులను నివేదించేటప్పుడు కచ్చితత్వాన్నీ, సున్నితత్వాన్నీ దృష్టిలో పెట్టుకోవాలని మీడియా సిబ్బందిని కోరారు. ముఖ్యంగా మైనర్ల వివరాలను గోప్యంగా ఉంచాలనీ, మాదకద్రవ్యాల బారిన పడ్డవారి వ్యక్తిగత వివరాలను అనవసరంగా బహిర్గతం చేయొద్దనీ సూచించారు.నషా ముక్త్ భారత్ లక్ష్య సాధనలో.. పోలీసులు మీడియా మధ్య బలమైన సమన్వయం, జాగరూకతతో కూడిన ప్రజల భాగస్వామ్యం అత్యావశ్యకమని ఆయన వ్యాఖ్యానించారు.పీఐబీ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్‌కృష్ణకాంత్ ప్రారంభోపన్యాసం చేశారు. ''డ్రగ్స్ ముప్పు ఇకపై వ్యక్తిగత సమస్యో, కుటుంబ సమస్యో కాదనీ, నేడు ఇదొక తీవ్రమైన సామాజిక, శాంతిభద్రతల, జాతీయ భద్రతా సవాలుగా పరిణమించింది'' అని ఆయన అన్నారు. 'వార్త' వర్క్‌షాప్ ద్వారా.. కచ్చితమైన సమాచారమూ, బాధ్యతాయుతమైన రిపోర్టింగ్ విధానాలతో జర్నలిస్టులను సన్నద్ధులను చేయడమే పీఐబీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తద్వారా వారు నషా ముక్త్ భారత్ అభియాన్‌కు అర్థవంతంగా దోహదపడి, మాదకద్రవ్యాల వ్యాప్తిని నివారించడంలో దోహదపడతారన్నారు.
అనంతరం వక్తలతో జర్నలిస్టులు మాట్లాడారు. కార్యాచరణ సమస్యలు, పునరావాస సేవల లభ్యత, మాదకద్రవ్యాల సంబంధిత కథనాల రిపోర్టింగ్ వంటి విషయాలపై వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పీఐబీ హైదరాబాద్ మీడియా కమ్యూనికేషన్ అధికారి వర్గంటి గాయత్రి కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 60 మంది మీడియా ప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆధారాలు లేని ఆరోపణలను ఖండించిన రైతు నిమ్మ రవీందర్ రెడ్డి

- కోర్టు ఉత్తర్వుల ప్రకారం రోడ్డు చదును చేస్తున్న రాజధాని డెవలపర్స్
- 46 ఏళ్లుగా మా ఆధీనంలోనే
- సర్వే నంబర్లకు సంబంధమే లేదు
- ఫారెస్ట్ శాఖ నుండి ఓ ఆర్ సి

మహేశ్వరం, ఆగస్టు 25,( అనంత జనశక్తి )




రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కొంగరకుర్దు పరిధిలో రాజధాని డెవలపర్స్ ఆధ్వర్యంలో 9 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న వెంచర్ విషయంలో కొంతమంది కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని భూ యజమాని నిమ్మ రవీందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.కొంగర, రావిరాల గ్రామానికి చెందిన కొంతమంది రైతులు తమ భూమిని కబ్జా చేసి నకిలీ పత్రాలు సృష్టించి వెంచర్ చేస్తున్నారని ఆరోపిస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మంగళవారం సదరు వెంచర్ డెవలపర్లు, భూ యజమానులు విలేకరుల సమావేశం నిర్వహించి వాస్తవాలను వెల్లడించారు.ఈ సందర్భంగా నిమ్మ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఇవి పూర్తిగా నిరాధారమైన, తప్పుడు ఆరోపణలని కొట్టిపారేశారు. తాము 9 మంది అన్నదమ్ములమని, అందరిలో తాను ఇదే ఊరిలో పెట్రోల్ బంక్ నిర్వహిస్తుండటం వల్ల అందరికీ తెలిసిన వ్యక్తిని అయ్యానని, అది ఓర్వలేకనే తనపై వ్యక్తిగత ఆరోపణలు, దూషణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**46 ఏళ్లుగా మా ఆధీనంలోనే...**

ఈ భూమి తాత ముత్తాతల నుండి సంక్రమించిన వంశపారంపర్య ఆస్తి అని, గత 46 ఏండ్లుగా తామే వ్యవసాయం చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. తమ వంశపారంపర్యంగా వచ్చే ఆస్తిని తామే కబ్జా చేశామని ఆరోపించడం చాలా దారుణమని అన్నారు.

**సర్వే నంబర్లకు సంబంధమే లేదు:**

తాము వెంచర్ నిర్వహిస్తున్న 9 ఎకరాల స్థలం సర్వే నంబర్లు 291, 292, 295 కాగా, కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన వ్యక్తులు పేర్కొన్న సర్వే నంబర్లకు తమ సర్వే నంబర్లకు ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. రెవెన్యూ ఆర్ డి ఓ అధికారి ఆధ్వర్యంలో సర్వే సజావుగా సాగిందని, చుట్టుపక్కల రైతులందరికీ రెవెన్యూ అధికారులు ముందుగానే నోటీసులు ఇచ్చి సర్వే చేయడం జరిగిందన్నారు. అసలు ఫిర్యాదు చేసిన సత్యనారాయణ అనే వ్యక్తికి చెందిన సర్వే నెంబర్ గల భూమి తమ పక్కన కూడా లేదని, అలాంటప్పుడు ప్రభుత్వ అధికారులు ఆయనకు నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

**ఫారెస్ట్ శాఖ నుండి ఓ ఆర్ సి**

తమ భూమికి అటవీ శాఖ భూమి ఆనుకుని ఉండటంతో తాము నిబంధనల ప్రకారం ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నుంచి ORC కూడా తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. అన్ని అనుమతులతోనే వెంచర్ చేస్తున్నామని చెప్పారు.
తమపై నిరాధార ఆరోపణలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకునేలా కోర్టులో, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఏదో ఒక విధంగా తమను భయపెట్టాలని ఎమ్మెల్యేలు, పెద్ద పెద్ద నాయకుల పేర్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

**రాజధాని డెవలపర్స్ స్పష్టీకరణ:**

అదేవిధంగా రాజధాని డెవలపర్స్ మాట్లాడుతూ తాము కోర్టు ఉత్తర్వుల ప్రకారమే రోడ్డు చదును చేసే పనులు చేపడుతున్నామని, ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని స్పష్టం చేశారు.

# శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులకు సహకరించాలి

- ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ర్యాలీని నిర్వహించాలి
- మహేశ్వరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో శాంతి సమావేశంలో పాల్గొన్న
- మహేశ్వరం ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డీసీపీ కె నారాయణరెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 25, ( అనంత జనశక్తి )



శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులకు సహకరించి ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ర్యాలీని నిర్వహించాలని మహేశ్వరం ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డీసీపీ కె నారాయణరెడ్డి అన్నారు. మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని మహేశ్వరంలో ఆగస్టు 26న నిర్వహించనున్న ర్యాలీ నేపథ్యంలో మంగళవారం మహేశ్వరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో శాంతి సమావేశం (పీస్ కమిటీ మీటింగ్) నిర్వహించారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ముస్లిం మత పెద్దలు, మైనారిటీ నాయకులు, కమిటీ ప్రతినిధులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, కరుణ,దయ,సోదరభావం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు.కులమతాలకు అతీతంగా ప్రపంచ శాంతి, మానవాళి సంక్షేమం కోసం ప్రవక్త మహమ్మద్ ఇచ్చిన సందేశాన్ని ప్రజలు పాటించాలని సూచించారు.

**క్రమశిక్షణతో ర్యాలీ నిర్వహించాలి**

మిలాద్-ఉన్-నబీ ర్యాలీలో పాల్గొనే యువత, భక్తులు క్రమశిక్షణతో వ్యవహరించాలని మత పెద్దలు సూచించారు. ఇతర మతాల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మహేశ్వరం ప్రాంతంలో ర్యాలీని ప్రశాంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

**పోలీసులకు సహకరించాలి**

మహేశ్వరం ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డీసీపీ కె. నారాయణరెడ్డి మాట్లాడుతూ పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ర్యాలీని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.ఏసీపీ జానకిరెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించిందని, చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. ముస్లింలు, హిందువులు అనే భేదాలు లేకుండా అందరం భారతీయులమనే భావనతో ముందుకు సాగాలని సూచించారు. రాజ్యాంగంలో సెక్యులర్ భావన ఉన్నంతకాలం ఎవరు తక్కువ, ఎవరు ఎక్కువ అనే భావనకు తావులేదన్నారు. ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, సోదరభావం, దయ, కరుణ వంటి విలువలను పాటిస్తూ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.మహేశ్వరం ఎస్‌హెచ్‌ఓ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని రేపు నిర్వహించనున్న మిలాద్-ఉన్-నబీ ర్యాలీకి అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ర్యాలీ సందర్భంగా పోలీసులు సూచించిన జాగ్రత్తలు, నిబంధనలు పాటిస్తూ కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించాలని ముస్లిం మత పెద్దలు, నిర్వాహకులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఏసీపీ జానకి రెడ్డి, మహేశ్వరం సి ఐ రాఘవేందర్ రెడ్డి, ఎస్సైలు రాఘవేందర్, ప్రసాద్, ధనుంజయ
ఈ సమావేశంలో ముస్లిం మత పెద్దలు, మైనారిటీ నాయకులు, కమిటీ ప్రతినిధులు, రాజకీయ నాయకులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# వెంచర్ రోడ్డు వివాదంపై మేనేజర్ కిరణ్ రెడ్డి క్లారిటీ

- మాస్టర్ ప్లాన్ ప్రకారమే 100 ఫీట్ల రోడ్డు
- కోర్టు అనుమతితోనే రోడ్డు పనులు
- రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదు

మహేశ్వరం, ఆగస్టు 25, ( అనంత జనశక్తి )



మాస్టర్ ప్లాన్ లో ఉన్న 100 ఫీట్ల రోడ్డును తాము చదును చేస్తున్నామని మేనేజర్ కిరణ్ రెడ్డి తెలిపారు. మీడియాతో మేనేజర్ కిరణ్ రెడ్డి మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ లో ఉన్న 100 ఫీట్ల రోడ్డును చదును చేస్తుండగా ఎదురుగా పెద్ద గుట్ట అడ్డుగా వచ్చిందన్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా ఇప్పటికే ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 289 సర్వే నంబర్లు గల భూమి నుండి రోడ్డు ఏర్పాటు చేసుకునేందుకు తాము కోర్టును ఆశ్రయించామని తెలిపారు. కోర్టు అనుమతుల మేరకే తాము రోడ్డు ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.
ఈ క్రమంలో రైతులను గాని, భూ యజమానులను గాని తాము ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని పేర్కొన్నారు.అయితే వక్ఫ్ బోర్డు భూమియైన సర్వే నెం. 471 వద్ద మాత్రం కొద్దిగా వివాదం చెలరేగిందని ఆయన తెలిపారు. అక్కడ కొందరు అక్రమంగా కబ్జా చేసి కంచె ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కోర్టు ఆర్డర్ ప్రకారం తూర్పు వైపు నుండి రోడ్డు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు.తమ వెంచర్ అన్ని అనుమతులతో, నిబంధనల ప్రకారమే ముందుకు వెళుతోందని, అనవసరపు ఆరోపణలను నమ్మవద్దని కిరణ్ రెడ్డి కోరారు.

# గురుకుల పాఠశాలలో బాలల హక్కుల కమిషన్ పర్యటన



- పిల్లలతో మమేకమైన బాలల హక్కుల కమిషన్ బృందం
- విద్యార్థుల నుంచి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు

విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా
సాగర్ బీసీ గురుకులంలో క్షేత్రస్థాయి పరిశీలన

నాగార్జునసాగర్,ఆగస్టు 25 అనంత జనశక్తి న్యూస్

విద్యార్థులకు అందుతున్న ప్రభుత్వ ఫలాలు,వసతుల తీరులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రంగంలోకి దిగింది. ఇందులో భాగంగానే మంగళవారం నాగార్జునసాగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలపై కమిషన్ ప్రత్యేక దృష్టి సారించింది,చైర్‌పర్సన్ తో పాటు ఆరుగురు సభ్యుల ఉన్నత స్థాయి బృందం పాఠశాలను సందర్శించి పరిశీలించింది,ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సంక్షేమం, భద్రత,మరియు మౌలిక వసతుల కల్పనపై ఉమ్మడి నల్గొండ జిల్లా ఆర్సీఓ స్వప్న,ప్రిన్సిపల్ రవికుమార్‌లతో కమిషన్ బృందం చర్చించింది. అయితే,కేవలం అధికారుల మాటలతో సరిపెట్టకుండా నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లిన కమిషన్ సభ్యులు విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. భోజన నాణ్యత, వంటగది పరిశుభ్రత,తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణతో పాటు బోధన తీరుపై విద్యార్థుల అభిప్రాయాలను నేరుగా సేకరించారు. పాఠశాలలో చదువుకుంటున్న 1200 మందికి పైగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వసతులు అందుతున్నాయని గుర్తించిన కమిషన్ బృందం హర్షం వ్యక్తం చేసింది,విద్యార్థుల సంక్షేమం కోసం యాజమాన్యం మరియు అధికారులు పడుతున్న శ్రమను మెచ్చుకుంటూ ప్రత్యేక అభినందనలు తెలిపింది.ఈ పర్యటనలో ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి స్వప్న, పెద్దవూర ఎంఈఓ తరి రాములు, పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్, నాగార్జునసాగర్ సర్కిల్ సీఐ శ్రీను నాయక్,పట్టణ ఎస్ఐ సతీష్, ఉపాధ్యాయుల బృందం,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్ భారీ ధర్నా

- హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి. యూత్ కాంగ్రెస్ డిమాండ్
- మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సుభాన్ యాదవ్

మహేశ్వరం, ఆగస్టు 25 ( అనంత జన శక్తి ):

ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సుభాన్ యాదవ్ అన్నారు.రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి, రాష్ట్ర ఇన్‌ఛార్జ్ సయ్యద్ ఖలీద్ అహ్మద్, కో‌ఇన్‌ఛార్జ్ కె.ఆర్ భవ్య జిల్లా ఇన్‌ఛార్జ్ సంతోష్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ ధర్నా జరిగింది.రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సుభాన్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివ చరణ్ రెడ్డి,మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి,పీసీసీ ప్రధాన కార్యదర్శులు ఏనుగు జంగారెడ్డి,షాద్ నగర్ వైస్ చైర్మన్ అందె మోహన్,జిల్లా ఇన్‌ఛార్జ్ సంతోష్ గౌడ్
జిల్లా ఉపాధ్యక్షులు దాయ సాగర్ రెడ్డి పాల్గొన్నారు.
అనంతరం హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేసి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు పోలమనేని రామకృష్ణ గారు, పృథ్వీ గౌడ్, కస్తూరి పవన్ ముదిరాజ్, దయాగౌడ్, గోపాలకృష్ణ, అసెంబ్లీ అధ్యక్షులు మహేష్ గౌడ్, శివ, మహిపాల్ యాదవ్, జిల్లా కార్యవర్గ కమిటీ సభ్యులు, అసెంబ్లీ కార్యవర్గ కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మండల, డివిజన్ కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అప్పుడే నాలోని చిత్రకారిణిని మేల్కొలుపుతా

వైవిధ్యభరితమైన కథలకు చిరునామాగా నిలుస్తూ.. నటనా ప్రాధాన్యమున్న పాత్రలతో మెప్పిస్తూ వరుస విజయాలతో జోరు చూపిస్తోంది నటి సాయిపల్లవి. అయితే ఆమెలో సహజ నటితో పాటు ఓ అద్భుతమైన చిత్రకారిణి కూడా ఉందంట. కానీ, తనలోని ఆ మరో కళని నైట్ షూట్స్‌లోనే చూసే అవకాశముందని చెబుతోంది. దీనికి వెనకున్న ఆసక్తికర విషయాన్ని తను ఇటీవల పంచుకుంది. "నాకు రాత్రిపూట చిత్రీకరణలు సవాల్‌గా అనిపిస్తాయి. ఎందుకంటే నేను నిద్రకి ఆగలేను. అందుకే నైట్ షూట్స్‌లో మేల్కొని ఉండేందుకు నాలోని చిత్రకారిణికి పని చెబుతుంటా. నా బ్యాగ్‌లో ఎప్పుడూ డ్రాయింగ్ బుక్, స్కెచెస్, క్రేయాన్స్ కచ్చితంగా ఉంటాయి. రాత్రిపూట షూట్స్‌లో నిద్రొస్తుందంటే చాలు.. వెంటనే ఆ బుక్ బయటకు తీసి బొమ్మలేయడం.. వాటికి రంగులు దిద్దడం లాంటివి చేస్తుంటా. అలా నన్ను నేను పెయింటింగ్‌లో బిజీగా ఉంచడం వల్ల నిద్ర దరి చేరకుండా ఉంటుంది. అలా ఇప్పటి వరకు చాలా డ్రాయింగ్ బుక్స్‌ని నింపాను" అని సాయిపల్లవి ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది.



# ఐఏఎస్ కావాలనుకున్నా

అవకాశం వస్తే చాలు.. సినీరంగంలోకి వచ్చి తెరపై తమని తాము చూసుకొని మురిసిపోవాలనుకుంటుంటారు చాలా మంది. కానీ బాలీవుడ్ నాయిక యామీ గౌతమ్ మాత్రం.. చిత్రపరిశ్రమకు రావాలని అనుకోలేదట. ఐఏఎస్ అధికారి కావాలని అనుకుందట. శక్తిమంతమైన పాత్రలు, వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరించే కథానాయికీమె. తనదైన నటనతో మెప్పించే ఈ తార.. ఓ సందర్భంలో కెరీర్ తొలినాళ్ల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "కెరీర్ గురించి పలు ఆలోచనలు ఉండటంతో చిత్రపరిశ్రమ ఎప్పుడూ నా ప్రాధాన్యతగా ఉండేది కాదు. ఒక భిన్నమైన రంగంలో రాణించాలనుకుంటున్నానని నాన్నతో చెప్పా. అందుకే న్యాయశాస్త్రం కూడా చదివాను. నేను మంచి విద్యార్థినిని. నటన గురించి బయట పెద్దగా మాట్లాడేదాన్ని కాదు. కానీ సినిమాలంటే అమితమైన ఇష్టం ఉండేది. సినిమాలు చూస్తూ.. ఆ పాత్రలను నేను పోషిస్తున్నట్లు మనసులో ఊహించుకునేదాన్ని. నా ఊహలు కలలుగానే మిగిలిపోతాయనుకున్నా. ఎందుకంటే నటన దిశగా అడుగులు వేసే ధైర్యం నాకుంటుందని ఎప్పుడూ అనుకోలేదు. ఆ తర్వాత ఒక టెలివిజన్ షో కోసం ఆడిషన్ ఇవ్వమని కుటుంబ సభ్యులు, స్నేహితులు చాలా ప్రోత్సహించారు. మా నాన్న ఇంట్లోనే నా ఆడిషన్‌ను ఫోన్లో చిత్రీకరించి.. దర్శకుడికి పంపించార"ని ఆనాటి సంగతుల్ని గుర్తుచేసుకుంది యామి. ప్రస్తుతం ఆమె 'నయీ నవేలి'తో బిజీగా ఉంది.



# నాది రాతి గుండె.. అలాంటిది 'ఇరుముడి' చూసి ఏడ్చేశా : రవితేజ

"హిందీలో రాజ్‌కుమార్ హిరాణీ చిత్రాలు చూస్తే భావోద్వేగంతో కన్నీళ్లు వచ్చేస్తాయి. తెలుగులో అలాంటి భావోద్వేగానికి గురి చేసిన సినిమా 'ఇరుముడి" అన్నారు కథానాయకుడు రవితేజ. ఆయన.. ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన ఈ సినిమాని శివ నిర్వాణ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. బేబీ నక్షత్ర, సాయికుమార్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఇటీవల విడుదలై విజయవంతంగా నడుస్తోంది. సోమవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో రవితేజ మాట్లాడుతూ.. "కరోనా సమయంలో ఓటీటీలో తమిళ, మలయాళ సినిమాలు చూసి.. ఇలాంటి కథలు మనకు రావేంటని అనుకునేవాళ్లం. ఇప్పుడీ చిత్రం ఆ మూలాలున్న కథతోనే వచ్చింది. నిజానికి నాది రాతి గుండె. నాకు సాధారణంగా ఏడుపు రాదు. అలాంటిది ఈ చిత్రం చూసి ఏడ్చేశాను. శివ నాకు ఈ కథ, త్రినాథ్ పాత్ర చెప్పి.. టైటిల్ వినిపించగానే సూపర్ అన్నా. ఇలాంటి మంచి ఫీల్ ఉన్న సినిమాని ప్రేక్షకులకు అందించినందుకు తనకు అభినందనలు. జీవీ ప్రకాశ్ సంగీతం ఈ చిత్రానికి ఆత్మ. ఈ సినిమా చూస్తున్నప్పుడు ఆ మ్యూజిక్‌తో అప్రయత్నంగా ప్రేక్షకులకు కళ్లలో నీళ్లు వచ్చేస్తున్నాయి. వాళ్ల స్పందన చూస్తుంటే నా కళ్లు చెమర్చాయి. మా అమ్మాయి మోక్ష కూడా ఈ చిత్రం చూస్తూ కన్నీళ్లు పెట్టుకుంది. ఎప్పుడో 20ఏళ్ల క్రితం థియేటర్‌కి వచ్చిన వాళ్లు మళ్లీ ఈ సినిమా చూడటానికి థియేటర్‌కి రావడం కూడా చాలా భావోద్వేగానికి గురి చేసింది. నిజంగా ఈ ఆనందం మామూలుది కాదు" అన్నారు. "నిన్ను కోరి', 'మజిలి' నన్ను తెలుగు వారి ఇళ్లలోకి తీసుకెళ్తే.. ఈ 'ఇరుముడి' నన్ను వాళ్ల హృదయాల్లోకి తీసుకెళ్లింది. ఈ చిత్రం కోసం మేమంతా ఒక యుద్ధంలా పని చేశాం. సమష్టి కృషి వల్లే ఇంతటి విజయం సాధ్యమైంది. దర్శకుడికి హీరో స్వాతంత్ర్యం ఇస్తే ఇలాంటి మంచి చిత్రాలు వస్తాయి. ఈ సినిమాలో ఇంటర్వెల్‌కి ముందు రవితేజని కొడతారు. 'నన్ను కొడితే అభిమానులు ఒప్పకుంటారా' అని ఆయన అనుంటే ఇలాంటి చిత్రం వచ్చేది కాదు. మేము కథ చెప్పేటప్పుడు ఎలాంటి లెక్కలేసుకోలేదు. ప్రేక్షకుడికి కథని కనెక్ట్ చేయాలన్న ఉద్దేశంతో పని చేశాం. దీంట్లో మణెమ్మ పాత్రలో నక్షత్ర ఎంతలా జీవించిందో ప్రేక్షకుల రియాక్షన్స్ చెప్తున్నాయి. అలాగే కావేరి పాత్రని ప్రియా చాలా సహజంగా చేసింది" అన్నారు దర్శకుడు శివ నిర్వాణ. నిర్మాతలు నవీన్ యెర్నేని, రవిశంకర్ మాట్లాడుతూ.. "ఒక సినిమా విడుదలైన రోజున్నరలోనే లాభాల్లోకి రావడం గత 50ఏళ్లలో ఎప్పుడూ జరగలేదని డిస్ట్రిబ్యూటర్లు చెప్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రాన్ని మేము చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. దీనికి ఎదురు లేదు. మరో నాలుగు వారాలు ఇది వెళ్తూనే ఉంటుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, ప్రియా భవానీ, స్వసిక, విష్ణు శర్మ, అనంత శ్రీరామ్, నక్షత్ర తదితరులు పాల్గొన్నారు.



## 100 మీటర్లు 9.39 సెకన్లలో..




9.58 సెకన్లలో 100 మీటర్ల పరుగు.. జమైకా దిగ్గజ స్ప్రింటర్ ఉసేన్ బోల్ట్ 2009లో నెలకొల్పాడు ఈ రికార్డు. ఇన్నేళ్లలో ఎవరూ దీని దరిదాపుల్లోకి కూడా రాలేదు. మనుషులకు అసాధ్యంగా మారిన ఈ వేగాన్ని మరమనిషి అధిగమించడం విశేషం. బీజింగ్‌లో జరిగిన ప్రపంచ హ్యూమనాయిడ్ రోబో క్రీడల 100 మీటర్ల పరుగును ఒక రోబో 9.39 సెకన్లలోనే పూర్తి చేసింది. ఈ మర మనిషిని బీజింగ్ హ్యూమనాయిడ్ రోబో ఇన్నోవేషన్ సెంటర్ తయారు చేసింది. ఈ రేసులో మరో రోబో (హానర్స్ లైట్నింగ్) 9.47 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రెండో స్థానంలో నిలిచింది. గత ప్రపంచ హ్యూమనాయిడ్ రోబో క్రీడల కంటే ఈసారి 100 మీటర్లలో ప్రదర్శన ఎంతో మెరుగైంది. నిరుడు ఈ 100 మీటర్ల రేసును టియాన్‌గాంగ్ అల్ట్రా తయారు చేసిన రోబో 21.50 సెకన్లలో పూర్తి చేయగలిగింది. ఇంతకుముందు చైనాకు చెందిన షెన్‌జెన్ హనర్స్ కంపెనీ రూపొందించిన 'ఫ్లాష్' అనే రోబో.. హాఫ్ మారథాన్‌లో 50 నిమిషాల 26 సెకన్లలోనే లక్ష్యాన్ని చేరింది. ఉగాండా రన్నర్ జకోబ్ పేరిట ప్రపంచ రికార్డు (57 నిమిషాల 20 సెకన్లు) ఉంది.

## మిక్స్‌డ్ డబుల్స్‌కు స్టార్ పవర్



యుఎస్ ఓపెన్‌లో సింగిల్స్ ఆట ఆరంభానికి ముందే ప్రేక్షకుల్ని అలరించేందుకు టెన్నిస్ స్టార్లు కార్లోస్ అల్కరాస్, నొవాక్ జకోవిచ్, సెరెనా విలియమ్స్, అరీనా సబలెంకా సిద్ధమయ్యారు. మంగళవారం ప్రారంభంకానున్న మిక్స్‌డ్ డబుల్స్‌లో వీళ్లు బరిలో దిగనున్నారు. అల్కరాస్- సెరెనా జోడీగా పోటీ పడుతున్నారు. వైల్డ్‌కార్డు ద్వారా అవకాశం దక్కించుకున్న ఈ ద్వయం.. మంగళవారం తొలి రౌండ్లో తలపడనుంది. సెరెనా 2022 తర్వాత యుఎస్ ఓపెన్లో ఆడటం ఇదే మొదటిసారి. జకోవిచ్, సబలెం కా జంట టాప్ సీడ్‌గా బరిలో దిగనుంది. రెండో సీడ్ దక్కించుకున్న జెస్సికా పెగులా- టేలర్ ఫ్రిట్జ్ జోడీ దియానా ష్నైడర్- కాస్పర్ రూడ్ జంటతో పోటీ పడనుంది. తొలి రౌండ్, క్వార్టర్‌ఫైనల్స్ మంగళవారమే జరగనుండగా.. సెమీస్, ఫైనల్ బుధవారం ఉంటాయి. గత ఏడాది యుఎస్ ఓపెన్ మెయిన్ డ్రా ఆరంభానికి ముందు మిక్స్‌డ్ డబుల్స్ టోర్నీని తొలిసారి ప్రయోగాత్మకంగా నిర్వహించారు.

# ఆ స్థానం కోసం పోరాడతాం



ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరే అవకాశం కొద్దిలో చేజారడం భారత జట్టును తీవ్రంగా నిరాశపరిచిందని కెప్టెన్ సలీమా టెటె చెప్పింది. "ప్రపంచకప్ సెమీఫైనల్ బెర్తుకు చాలా సమీపంగా వచ్చి ఆగిపోయాం. ఈ టోర్నీ కోసం ఎంతో కష్టపడ్డాం. మెరుగైన ప్రదర్శనే చేశాం. కానీ అనుకున్న ఫలితాన్ని సాధించలేకపోయాం. ఏ చిన్న అవకాశాన్ని వదులుకోకూడదనే విషయాన్ని నేర్చుకున్నాం. ఇక అయిదో స్థానం కోసం పోటీపడనున్నాం. కచ్చితంగా పుంజుకుంటాం. మాలో ఆ పోరాటతత్వం అలాగే ఉంది. అయిదో స్థానాన్ని అయినా సాధిస్తే జట్టు ఆత్మస్థైర్యం పెరుగుతుంది" అని సలీమా చెప్పింది. మూడో ప్రపంచకప్ ఆడుతున్న సవిత పునియా కూడా ఆస్ట్రేలియాతో మ్యాచ్ ఫలితంతో తీవ్ర నిరాశకు గురైంది. "భారత్‌కు ఇదే అత్యుత్తమ అవకాశం. చాలా దగ్గరగా వచ్చాం. మళ్లీ ఇలాంటి ఛాన్స్ వస్తుందో లేదో" అని సవిత పేర్కొంది. ప్రస్తుత ప్రపంచకప్‌లో 11 మంది భారత ప్లేయర్లు తొలిసారి ఆడారు. ఆస్ట్రేలియాతో మ్యాచ్ డ్రా అయి.. జట్టు నిష్క్రమించడంతో భారత అమ్మాయిలు కన్నీళ్లు పెట్టుకున్నారు.

# అబ్బాయిలూ.. అమ్మాయిల బాటే



హాకీ ప్రపంచకప్‌లో భారత దశాబ్దాల పతక నిరీక్షణకు ఈసారీ తెరపడలేదు. పురుషుల జట్టుకు మళ్లీ రిక్తహస్తమే మిగిలింది. పతక అంచనాలతో బరిలో దిగిన హర్మన్‌ప్రీత్ బృందం సెమీఫైనల్ చేరడంలో విఫలమైంది. సెమీస్ రేసులో ఉండాలంటే ఘనంగా (కనీసం 3 గోల్స్ తేడా) నెగ్గాల్సిన పూల్-ఇ పోరులో సోమవారం భారత్ 3-5తో అర్జెంటీనా చేతిలో ఓడింది. టోర్నీ రెండో దశలో ఆడిన రెండు మ్యాచ్‌లూ ఓడి రేసు నుంచి నిష్క్రమించింది. అర్జెంటీనా (6 పాయింట్లు) సెమీస్ చేరింది. అన్నే పాయింట్లు సాధించిన నెదర్లాండ్స్ ఇప్పటికే ముందంజ వేసింది. ఇంగ్లాండ్ (3) మూడో స్థానంలో నిలిచింది. ఇక భారత్ 5-6 స్థానాల వర్గీకరణ మ్యాచ్ ఆడనుంది. అర్జెంటీనాతో మ్యాచ్‌లో ఆరంభం నుంచి భారత్‌ది వెనుకడుగే. తొలి క్వార్టర్ తొలి నిమిషంలోనే అర్జెంటీనా గోల్ కొట్టేసింది. గోల్‌కు ఎడమవైపు నుంచి దూసుకొచ్చిన టాస్కని కీపర్ మోహిత్‌ను బోల్తా కొట్టిస్తూ బంతిని నెట్‌లోకి పంపించాడు. కాసేపటికే భారత్‌కు ఇంకో షాక్! నికోలాస్ డెలా (6వ నిమిషం) పెనాల్టీకార్నర్‌ను గోల్‌గా మలిచి అర్జెంటీనా ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. కాసేపటికి భారత్ పుంజుకుంది. సుఖ్‌జీత్ సింగ్ (10వ నిమిషం) ఓ సూపర్ ఫీల్డ్ గోల్‌తో భారత్ ఖాతా తెరిచాడు. రెండో క్వార్టర్‌లోనూ అర్జెంటీనా దూకుడు కొనసాగినా.. ఆ జట్టు దాడులను భారత డిఫెండర్లు కాచుకున్నారు. మూడో క్వార్టర్‌లోనూ అర్జెంటీనా వద్దే బంతి ఎక్కువగా కనబడింది. హర్మన్‌ప్రీత్ బృందానికి ప్రత్యర్థిని కాచుకోవడమే సరిపోయింది. ఎదురుదాడికి అవకాశం లేకుండాపోయింది. భారత కష్టాలను పెంచుతూ థామస్ (33, 45 నిమిషాలు) తక్కువ సమయంలో రెండు గోల్స్ కొట్టడంతో అర్జెంటీనా 4-1తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. మూడో క్వార్టర్‌లో భారత్‌కు వరుసగా 4 పెనాల్టీకార్నర్లు దక్కినా ఉపయోగించుకోలేకపోయింది. పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తూ అర్జెంటీనా ఆధిక్యం 5-1గా మారిపోయింది. ఈసారి లుకాస్ (53వ) గోల్ కొట్టాడు. దీంతో భారత్‌కు ఘోర పరాభవం తప్పదనిపించింది. మరో రెండు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా సుఖ్‌జీత్ (58వ), హార్దిక్ (60వ) సఫలం కావడంతో జట్టు కాస్త గౌరవప్రదంగా ఓడింది. భారత్ ఆఖరి గోల్.. పెనాల్టీ స్ట్రోక్ ద్వారా లభించింది. పెనాల్టీ కార్నర్లను వీలైనన్ని సద్వినియోగం చేసుకోలేకపోవడం, పాసింగ్‌లో గందరగోళం, ఫినిషింగ్ లేకపోవడం, బలహీనమైన ఎటాకింగ్ హర్మన్‌ప్రీత్ బృందాన్ని ముంచింది.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945